RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 24 జూలై 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:48

# విద్యార్థుల పక్షాన మేం ఉన్నాం:

## గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నిరసన దీక్ష



నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ వివాదంతో నష్టపోయిన విద్యార్థులకు అండగా నిలుస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో గురువారం సాయంత్రం ఢిల్లీలోని తీస్ జనవరి మార్గ్‌లో ఉన్న గాంధీ స్మృతి వద్ద వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు, నిరసనల్లో గాయపడిన వారికి సంఘీభావం ప్రకటించారు.

అంతకుముందు, రాహుల్ గాంధీ నివాసంలో విపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం ప్రియాంక గాంధీ వాద్రాతో సహా పలువురు నేతలు బస్సుల్లో గాంధీ స్మృతికి చేరుకున్నారు. అక్కడ వారు తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్‌లైట్లను వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఒక చేతిలో జాతీయ జెండాను, మరో చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని కనిపించారు.

ఈ నిరసనపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. న్యాయం, జవాబుదారీతనం కోరుతున్న విద్యార్థులతో ప్రతిపక్షాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. "భారతదేశ విద్యార్థులు ఒంటరి కాదు. విద్యార్థుల పక్షాన నిలబడకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని పేర్కొన్నారు. నీట్ అక్రమాల తర్వాత ప్రాణాలు తీసుకున్న విద్యార్థులను స్మరించుకుంటూ, ఆందోళనల్లో గాయపడిన వారికి మద్దతుగా ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు.

వాస్తవానికి విపక్షాలు ఇండియా గేట్ వరకు ప్రదర్శనగా వెళ్లాలని భావించినా, పోలీసులు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. దీంతో రాహుల్ నివాసానికి కిలోమీటరు దూరంలోనే ఉన్న గాంధీ స్మృతి వద్ద నిరసన చేపట్టారు. మరోవైపు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు.

నీట్-యూజీ 2026 పరీక్షలో పేపర్ లీక్, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి సంఘాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈ నిరసనల నేపథ్యంలో పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. తాజా విపక్షాల నిరసనతో ఈ అంశంపై రాజకీయ ఒత్తిడి మరింత పెరిగింది.






చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్ , అద్దంకి దయాకర్ , బల్మూర్ వెంకట్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , జైవీర్ రెడ్డి ఉన్నతాధికారులు

## ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాలి రేవంత్ రెడ్డి



రాష్ట్రంలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్‌బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యత విషయంలో రాజీపడబోమని స్పష్టంగా చెప్పారు.

ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్య గారికి సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని, మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నందున నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని అన్నారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు.

వచ్చే విద్యా సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి సుదర్శన్ రెడ్డి , స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ , సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ , సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి సి ఆర్ పాటిల్ కి వినతిపత్రం అందజేసిన తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు



కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రస్తుత నిర్వహణ సాధ్యసాధ్యాలపై సమగ్ర సాంకేతిక పరిశీలన నిర్వహించి, భవిష్యత్ నిర్వహణకు సంబంధించి స్పష్టమైన సిఫార్సులు అందించాలని కోరుతూ కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర సహచర ఎంపీలు, ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి ఎమ్మెల్సీ అంజి రెడ్డి తో కలిసి కేంద్ర మంత్రి సి ఆర్ పాటిల్ కి వినతిపత్రం అందజేసిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు.

## తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలి రేవంత్ రెడ్డి



వార్తా 2 లో

# కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు గృహాలు

### రూ.40--60 లక్షల విలువైన ఇంటిని లబ్దిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలు

### ఇండ్ల కేటాయింపులో బడుగు, బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు

### మీసేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులకు అవకాశం

### -- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైదరాబాద్ నగరంలో సొంత ఇల్లు లేని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన గృహాలను అందుబాటు ధరలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఌ పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, దరఖాస్తుల ప్రక్రియ, అమలు విధానంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ, నిరుపేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించేందుకు నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో విలువైన ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తూ, అర్హులైన కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఇందిరమ్మ టవర్స్ ద్వారా నగరంలో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన గృహాలను అందుబాటు ధరలో అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఈ గృహాల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు.లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే ఉంటుందని చెప్పారు. తొలి విడతలో ఎంపిక చేసిన 16 నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఫ్లాట్ల మార్కెట్ విలువ సుమారు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ఎస్ఆర్‌వో (బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉందన్నారు. భూమి విలువ, నిర్మాణ వ్యయం, ప్రభుత్వ సబ్సిడీ కలిపి అర్హులైన కుటుంబాలకు తక్కువ వ్యయంతో గృహాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.క్యూర్ (Core Urban Region) పరిధిలో తొలి విడతగా నిర్మించనున్న ఇందిరమ్మ గృహాల్లో యాజమాన్య హక్కుల కేటాయింపులో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు మరియు పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ రిజర్వేషన్ కేటగిరీలలో 30 శాతం మహిళలకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.మిగిలిన50 శాతం గృహాలను జనరల్ కేటగిరీలో కేటాయిస్తామని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన వారు సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అలాగే మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096మరియు ఎవవseva .telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.

ప్రజాబలం

24 జూలై 2026 శుక్రవారం

# బీజేపీ గేమ్ లో సీజేపీ

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వెలుపల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నా, ఆందోళన సందర్భంగా ఆయన గాయపడటం జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదానికి కారణమైంది. అయితే,పైకి కనిపించే ఈ రాజకీయ నిరసన వెనుక అత్యంత సంక్లిష్టమైన వ్యూహాత్మక రాజకీయ కోణం ఉందనే చర్చ ఇప్పుడు రాజకీయ పరిశీలకుల్లో జోరుగా సాగుతోంది.ప్రస్తుతం దేశంలో తీవ్రరూపం దాల్చుతున్న సిజెపి ఆందోళనలు, కాక్రోచ్‌ల ఉద్యమం వంటి తీవ్రమైన ప్రజా ఆగ్రహ ఉద్వేగాలను పక్కదారి పట్టించడానికి లేదా వాటి ఉధృతిని తగ్గించడానికి ఈ ధర్నా ఒక సేఫ్టీ వాల్వ్‌లా ఉపయోగపడిందనే వాదన ప్రధానంగా వినిపిస్తోంది. ప్రజా సమస్యలపై జరుగుతున్న ఈ ఉగ్ర పోరాటాల తీవ్రతను కప్పిపుచ్చేందుకు, ప్రజల మరియు మీడియా దృష్టిని పూర్తిగా రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన వైపు మళ్లించేందుకు ఇదొక చక్కటి వ్యూహంగా అమలు చేశారని భావిస్తున్నారు. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ఇలాంటి నాటకీయ పరిణామాలు దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ పరిణామం ద్వారా అధికార పక్షానికి ఒక రకమైన వ్యూహాత్మక ప్రయోజనం చేకూరినట్లు కనిపిస్తోంది. సున్నితమైన ఉద్యమాల నుంచి దృష్టిని వేరే వైపు మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ధర్నా ఒక కంట్రోల్డ్ ఆపోజిషన్ వ్యూహంలో భాగమనే అనుమానాలు బలపడుతున్నాయి. రాహుల్ గాంధీకి తగినంత స్పేస్ ఇవ్వడం ద్వారా అసలు సమస్యల మూలాలను తెరవెనుకకు నెట్టి, కేవలం వ్యక్తిగత లేదా పార్టీ కేంద్రీకృత అంశాలపై చర్చ జరిగేలా చూడటంలో బీజేపీ వ్యూహం సఫలమైందనే చెప్పాలి.రాహుల్ గాంధీకి ఈ స్థాయిలో నిరసన తెలిపేందుకు, మీడియాలో భారీ స్పేస్ ఆక్రమించేందుకు అధికార బీజేపీయే వ్యూహాత్మకంగా అవకాశం కల్పించిందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికంగా జరగదనే నానుడికి తగినట్లుగా, కాంగ్రెస్ అగ్రనేతను ఒక పావులా వాడుకుని పెద్ద ఎత్తున ప్రజా దృష్టిని వేరే అంశాల వైపు మళ్లించే ప్రయత్నం జరిగిందన్న భావన వ్యక్తమవుతోంది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ హై-వోల్టేజ్ ఆందోళనను అధికార పక్షం తమకు అనుకూలమైన ఒక వ్యూహాత్మక ఆయుధంగా మలచుకుందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయిమీడియా దృష్టిని పూర్తిగా మోదీ నివాస ఆందోళన , రాహుల్ గాంధీ గాయం చుట్టూ కేంద్రీకరించడం ద్వారా, దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న ఇతర ప్రజా ఉద్యమాల వేగం ఆకస్మికంగా నెమ్మదించింది. మీడియాలో ప్రధాన హెడ్‌లైన్స్ అన్నీ రాహుల్ ధర్నా గురించే రావడంతో, కాక్రోచ్‌ల ఉద్యమం, సిజెపి ఆందోళనల తీవ్రత కొంతమేర కిందికి దిగివచ్చింది. ఇది అధికార పార్టీకి వ్యూహాత్మకంగా అతిపెద్ద ఊరటనిచ్చే అంశంగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం వ్యూహంలో కాంగ్రెస్ పార్టీ తాము ఒక పెద్ద పోరాటం చేశామని భావిస్తున్నప్పటికీ, వాస్తవానికి అది అధికార పార్టీ వ్యూహంలో భాగస్వామ్యం కావడమేనని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. బీజేపీ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని భావించిన రాహుల్ గాంధీకి స్పేస్ దక్కినప్పటికీ, దానివల్ల అసలు ప్రజా సమస్యల తీవ్రత నీరుగారిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నుంచి దృష్టిని మళ్లించే డెకాయ్ రాజకీయాలకు కాంగ్రెస్ మరోసారి బలయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రధాని నివాసం వెలుపల రాహుల్ గాంధీ చేసిన ధర్నా , ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు కేవలం ఒక సాధారణ నిరసన ప్రదర్శన మాత్రమే కాదని, ఇదొక పెద్ద రాజకీయ మైండ్ గేమ్‌గా స్పష్టమవుతోంది. తీవ్రమైన ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకు అధికార పక్షం అందించిన సేఫ్టీ వాల్వ్ స్పేస్‌ను కాంగ్రెస్ వాడుకోవడం ద్వారా, తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందినట్లు కనిపించినా దీర్ఘకాలికంగా మాత్రం క్షేత్రస్థాయి ఉద్యమాల తీవ్రత దెబ్బతిన్నదనేది ఎక్కువ మంది భావన.

# సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**సత్తుపల్లిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన**
**ఓసీ-2 మైన్ సందర్శన, ఉద్యోగుల క్వార్టర్ల ప్రారంభం, అధికారులతో సమీక్ష**





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 23 :** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం పలికాయి. సింగరేణి అభివృద్ధి, కార్మిక సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి అంశాలపై నిర్వహించిన పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

పర్యటనలో భాగంగా భట్టి విక్రమార్క సత్తుపల్లి సింగరేణి జేవీఆర్ ఓసీ-2 మైన్‌ను సందర్శించి గనుల తవ్వకాలు, ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించారు. అధికారులు గని పనితీరు, భద్రతా చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై వివరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సింగరేణి ఉద్యోగుల నివాస క్వార్టర్లను ప్రారంభించి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

తర్వాత సింగరేణి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సింగరేణి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

అనంతరం తల్లాడలో దివంగత కాంగ్రెస్ నాయకుడు, తల్లాడ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దగ్గుల రఘుపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ దివాకర్, డీఎఫ్‌వో, టీఎస్ఎన్‌డీపీఎల్ సీఎండీ, సింగరేణి జీఎం శ్రీనివాస్, పీఓ, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఆర్‌డీఓ మరో ఘనత..
# 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

**విజయవంతంగా 'కుశ' క్షిపణి తొలి ప్రయోగం**
**ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ**
**సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం**
**రక్షణ రంగంలో ఇదొక మైలురాయి అన్న రాజ్‌నాథ్ సింగ్**
**విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వెల్లడి**



రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (LR-SAM) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి.

గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (UAV), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది.

'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది.

'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.

ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలి రేవంత్ రెడ్డి

క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలని చెప్పారు.

రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగునీటి వనరులను అనుసంధానించాలని చెప్పారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందని అన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎస్టీపీల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు.

తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు.

రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమీక్షలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ , జల మండలి ఎండీ కె అశోక్ రెడ్డి , జేఎండీ మయాంక్ మిట్టల్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు...

## జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో 1000 మందితో మహా పాదయాత్ర

## ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిన సంగారెడ్డి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 23(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో



రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు ,తమ పార్టీ నేతలను నిర్బంధించి పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు,కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు,సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.

# హైదరాబాద్‌లో '11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్--2026' పోటీలను ప్రారంభించిన కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్

## పోలీసు క్రీడలు జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తాయి, ప్రతిభను ప్రోత్సహిస్తాయి: శ్రీ బండి సంజయ్ కుమార్

జూడో క్లస్టర్‌లో పాల్గొంటున్న 36 రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల విభాగాలకు చెందిన 1,600 మంది క్రీడాకారులు

2026, జులై 23, హైదరాబాద్: గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్--2026' క్రీడా పోటీలను కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ఈరోజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. దేశ నిర్మాణానికి, యువత సాధికారతకు సాధనంగా క్రీడలను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు. ఖేలో ఇండియా, ఆసియా క్రీడలు, ప్రపంచ పోలీసు--అగ్నిమాపక క్రీడలు తదితర కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను కేంద్రం విస్తరిస్తోందని చెప్పారు. కేంద్రం క్రీడల బడ్జెట్‌ను రూ.4,480 కోట్లకు పెంచిందన్నారు. గతేడాది కేటాయింపుల కంటే ఇది రూ.1,100 కోట్లకు పైగా అధికంగా ఉందని తెలియజేశారు. ప్రపంచ క్రీడాశక్తిగా ఎదగాలన్న భారత లక్ష్యాన్ని శ్రీ బండి సంజయ్ కుమార్ పునరుద్ఘాటించారు. 2047 నాటికి అయిదు అగ్ర క్రీడా దేశాల్లో ఒకటిగా మారాలన్న దేశ దీర్ఘకాలిక ఒలింపిక్ లక్ష్యం గురించి వివరించారు.

"ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బందిని ఒకే వేదిక మీదకు తీసుకువస్తాయి. స్నేహాన్ని, పరస్పర అవగాహనను, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. తద్వారా జాతీయ ఐక్యతను, దేశ సమగ్రతను బలోపేతం చేస్తాయి" అని ఆయన అన్నారు. పోలీసు క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. దీనిని సమ్మిళితత్వం, సాధికారత దిశగా వేసిన ముందడుగుగా వర్ణించారు. ఈ పోటీలు స్వర్ణం, రజతం, కాంస్య పతకాలను గెలవడం కోసం మాత్రమే



కాదని అభిప్రాయపడ్డారు. "దేశభద్రతను కాపాడుతూ, కీలకమైన ప్రదేశాలకు రక్షణ కల్పిస్తూ, ప్రజాక్షేమం కోసం నిరంతరం శ్రమించే భద్రతా దళాలు, పోలీసుల జీవితాల్లో క్రీడలు విడదీయరాని భాగం" అని ఆయన తెలిపారు.

1969 నుంచి దేశంలో అత్యంత కీలమైన ఆస్తులకు, మౌలిక వసతులకు అవసరమైన భద్రతను సీఐఎస్ఎఫ్ అందిస్తోందని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి చెప్పారు. వాటిలో విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రో, వారసత్వ కట్టడాలు, అణు, అంతరిక్ష సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జైళ్లు, దేశ ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన పార్లమెంటు సముదాయం ఉన్నాయన్నారు. "ఇటీవలే జరిగిన ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అభిమన్యు స్వర్ణ పతకం సాధించారు. అంతర్జాతీయ రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానాన్ని సాధించారు. ఇది మనందరికీ గర్వకారణం. ఇది క్రీడలకు సీఐఎస్ఎఫ్ ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, ఇటీవలే సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం నాకు నిజంగా గర్వాన్ని కలిగించింది. అథ్లెట్ల సంక్షేమం కోసం అనేక ముఖ్యమైన కార్యక్రమాలను ఈ దళం చేపడుతోంది. సంక్షేమ పథకాలను విస్తరించింది. అథ్లెట్లకు ఇప్పుడు నేరుగా అదనపు ఆర్థిక సాయం లభిస్తోంది. నాణ్యమైన పోషకాహారం, ఆధునిక క్రీడా సామగ్రి లేదా గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి అవసరమైన సౌకర్యాల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. ఈ చర్యలన్నీ మన అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, దేశానికి మరిన్ని విజయాలను తీసుకురావడానికి దోహదపడతాయి" అని ఆయన అన్నారు.

సీఐఎస్ఎఫ్ ఏడీజీ (సౌత్) పద్మాకర్ ఎస్ రన్పిసే, సీఐఎస్ఎఫ్ ఏపీఎస్--×× ఐజీ ఎస్ఆర్ శరవణన్, సీఐఎస్ఎఫ్ ఐజీ, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి, పీఐబీ ఏడీజీ శ్రీమతి శ్రుతి పాటిల్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 జులై 23 నుంచి 30 వరకు 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్--2026 పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో 36 రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) విభాగాలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరు జూడో, వుషు, తైక్వాండో, కరాటే, పెన్చాక్ సిలాట్ క్రీడల్లో పోటీపడతారు.

# మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు శాశ్వత భద్రత

## సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్గా ప్రారంభించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా బ్లాక్చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించింది. ప్రతి ల్యాండ్ పార్సెల్కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి టాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థ రూపకల్పన చేసారు. డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను పూర్తిగా నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం వుంటుంది. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్ట్.

కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో ఈ పైలెట్ ప్రాజెక్ట్ అమలు అవనుంది. ? ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు.

ఈ కార్యక్రమానికి మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు.. వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లను వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ వ్యవస్థలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి

భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అన్నారు.

# అవినీతి అనకొండే...

హైదరాబాద్, జూలై 23, హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలతోపాటు.. రూ.52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ.. గతంలో కూడా 2019లో లంచం కేసులో ఏసీబీకి చిక్కిన విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ.. ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# కేటీఆర్ జన్మదిన వేడుకలు

## రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పెద్దపల్లి రాష్ట్ర సాధనలో, రాష్ట్ర భవిష్యత్తును టెక్నికల్, పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా నిలపడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుం ట్ల తారక రామారావు చేసిన కృషి చిరస్మరణీయమ ని టీఎస్టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ కొనియాడారు. కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ముందస్తు వేడుకలను గులాబీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ను పరామర్శించి, వారికి స్వయంగా పండ్లు,బ్రెడ్లను పంపిణీ చేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో పరిపూర్ణమైన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద నీట్ వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులపై జరిగిన లాఠీచా ర్జికి నిరసనగా తలపెట్టిన ధర్నా కార్యక్రమం లో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థి విభాగం, యువత పెద్దఎత్తున తరలి వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఒకరోజు ముందే పెద్దపల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లో ఉండి రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమని, కేంద్రం లో నీట్ పేపర్ లీకేజీకి కారణ మైన బీజేపీ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల వద్ద దిష్టిబొమ్మలు దహనం చేయడం,నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉంద న్నారు. గ్రూప్-1 ఇంటర్వ్యూ లకు పిలిచిన 3,200 మందికి పైగా అభ్యర్థుల వివరాలు ఇప్పటివరకు వెల్లడించకపో వడం, అలాగే నీట్ పీజీ పరీక్షలో జీరో మార్కులు వచ్చిన వారికి కూడా వాలిడి టీ ఇస్తూ సీట్లు కేటాయించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. ప్రభుత్వాల ప్రజా వ్యతి రేక విధానాలను ఎండగట్టేం దుకే ఈ నిరసన కార్యక్రమా లు చేపడుతున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్లు బిక్షపతి,స్వామి,ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్,బింగి రాజు,మేడుదుల రాజ్ కుమార్,ఉప్పు శివ కుమార్,బోయిని మనోజ్,పెంచాల శ్రీకాంత్,శ్రీకాంత్,కంచి నాగరాజ్,దాసరి సతీష్,ఇరుగురాల స్వామి దాస్,సాయి, వెంకటేష్లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దసరా నుంచి వందే భారత్ స్లీపర్

విజయవాడ, జూలై 23, ఏపీ ప్రజలకు భారీ గుడ్ న్యూస్. రైల్వేశాఖ సూపర్ న్యూస్ అందించనుంది. ఏపీ మీదుగా వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపేందుకు కసరత్తులు చేస్తోంది. విజయవాడ డివిజన్ మీదుగా ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలి స్లీపర్ రైలును ఈ ఏడాది జనవరిలో హౌరా-గువహతి మధ్య రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. ప్రధాని మోదీ స్వయంగా దీనిని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం ఏపీ మీదుగా సాధారణ వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి వరకు, కాచిగూడ నుంచి బెంగళూరు, నర్సాపురం నుంచి చెన్నైకు రైళ్లు నడుస్తున్నాయి. అయితే స్లీపర్ రైళ్లు లేకపోవడంతో ఇప్పుడు వాటిని కూడా తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తోంది.దసరా నాటికి విజయవాడ మీదుగా వందే భారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, విజయవాడ నుంచి బెంగళూరు మధ్య ఈ రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇక విజయవాడ నుంచి అయోధ్య, విజయవాడ నుంచి ఢిల్లీకి నడిపితే బాగుంటుందని మరికొంతమంది ప్రతిపాదిస్తున్నారు. దీంతో ఏ రూట్లో అనేది క్లారిటీ లేనప్పటికీ.. దసరా నాటికి ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కనుందని తెలుస్తోంది. వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన కుషనింగ్, లేటెస్ట్ ఇంటీరియల్స్, ఇంటర్నెట్, ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డోర్లు, ఎల్ఈడీ డోర్లు, ఎల్ఈడీ లైట్లు, సౌండ్ ప్రూఫ్, ప్రత్యేక సెన్సార్లు వంటివి ఉన్నాయి. విమానం తరహాలోనే అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి.వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 160 నుంచి 180 కిలోమీర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇందులో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు ఉంటాయి. ఇప్పటికే ప్రారంభమైన హౌరా-గువహతి తొలి వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. ఈ ట్రైన్లో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. అయితే స్లీపర్ రైళ్లల్లో ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటివి ఉండవు. కన్ఫార్మ్‌డ్ టికెట్ ఉన్నవారిని మాత్రమే ప్రయాణానికి అనుమతిస్తారు. వీటిల్లో సౌండ్ ప్రూఫ్ సిస్టమ్ ఉండటంతో ఎలాంటి సౌండ్స్, కుదుపులు అనేవి ఉండవు. దీంతో రాత్రి సమయంలో ప్రశాంతంగా ప్రయాణం చేయవచ్చు. అటు సికింద్రాబాద్-ఢిల్లీ రూట్లో కూడా వందే భారత్ స్లీపర్ రైలు తీసుకురావాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నాలు చేస్తోంది.

## గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి

కాకినాడ, జూలై 23, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ-జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది.పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళ్లు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది.అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు-పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్టానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.

## పక్క చూపులు చూస్తున్న కన్నబాబు

విశాఖపట్టణం, జూలై 23, అనకాపల్లి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు వ్యవహారశైలి ఇటీవల మరోసారి చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటుండటం, పార్టీ ముఖ్యమైన నిరసన కార్యక్రమాల్లో కూడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు కారణమవుతోంది. దీంతో ఆయన పార్టీతో కొనసాగుతున్నారా, లేక రాజకీయంగా కొత్త నిర్ణయాల వైపు అడుగులు వేస్తున్నారా అనే చర్చ సాగుతోంది.ఇటీవల ఎలమంచిలి నియోజకవర్గంలోని పంచదార్లప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. అయితే మూడు సార్లు ఎలమంచిలి ఎమ్మెల్యేగా పనిచేసిన కన్నబాబురాజు ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.కన్నబాబురాజు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా చురుకుగా పాల్గొనడం లేదని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పుట్టినరోజు వేడుకల సందర్భంగా కూడా పార్టీ నాయకుల హడావుడి కనిపించకపోవడం ఈ చర్చలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఇది ఆయన రాజకీయ వ్యూహంలో భాగమని భావిస్తున్నవారూ ఉన్నారు.2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన కన్నబాబురాజు, 2024 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల అనంతరం కొంతకాలం పాటు పార్టీ ఆయననే నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించింది. అయితే తరువాత పార్టీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కి ఆ బాధ్యతలు అప్పగించింది. ఈ నిర్ణయం తర్వాత కన్నబాబురాజు అసంతృప్తికి గురయ్యారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది.ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీకి చెందిన రెండు వర్గాలు విడివిడిగా పనిచేస్తున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒకవైపు కరణం ధర్మశ్రీ వర్గం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు కన్నబాబురాజు అనుచరులు కూడా తమకంటూ ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో టికెట్ కోసం పోటీకి సంకేతంగా భావిస్తున్నారు.మరోవైపు, వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ (కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు కన్నబాబురాజు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రస్తుతం మౌన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు.అయితే కన్నబాబురాజు ఇప్పటివరకు పార్టీని వీడుతున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఆయనపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, స్థానిక రాజకీయ పరిణామాల్లో మౌనం పాటించడం వంటి అంశాలు ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆసక్తిని పెంచుతున్నాయి.రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజకవర్గ రాజకీయాలు ఎలా మారతాయి, కన్నబాబురాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా లేదా కొత్త రాజకీయ నిర్ణయం తీసుకుంటారా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

## మొన్న దువ్వాడ, నిన్న సిదిరి..

## ఇవాళ తమ్మినేని

శ్రీకాకుళం, జూలై 23, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ( ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ )కి బలమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. 2019 ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించినప్పటికీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. టీడీపీ కూటమి ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తిరిగి బలం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.2024 ఎన్నికల తర్వాత జిల్లాలో వైసీపీ పార్టీని సమన్వయం చేసే బలమైన నాయకత్వం లేకపోవడం, అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు పార్టీ పునర్నిర్మాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే సమయంలో కీలక నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలవడం కూడా పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తీసుకొస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల మాజీ స్పీకర్, మాజీ మంత్రి తమ్మినేని సీతారాం పేరు భూ వివాదానికి సంబంధించిన కేసులో రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఆరోపణలపై కేసు నమోదైనట్లు సమాచారం. ఈ ఆరోపణలను చట్టపరమైన విచారణలో అధికారులు పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించి తమ్మినేని సీతారాం లేదా ఆయన కుటుంబం నుంచి పూర్తి స్థాయి స్పందన రావాల్సి ఉంది. కాబట్టి ఆరోపణలు ఇప్పటికీ న్యాయపరమైన విచారణ దశలోనే ఉన్నాయిఈ పరిణామాల నేపథ్యంలో తమ్మినేని సీతారాం రాజకీయ భవిష్యత్తుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. భవిష్యత్‌లో లోక్‌సభ ( ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆయన కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ ను ఆముదాలవలస ( అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దించాలని కుటుంబం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో భూ వివాదం రాజకీయంగా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న సవాళ్లు ఒక్క తమ్మినేని సీతారాంతోనే పరిమితం కాలేదు. టెక్కలి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. మరోవైపు పలాస మాజీ మంత్రి సీదరి అప్పలరాజు కుటుంబం కూడా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనతో వార్తల్లో నిలిచింది. ఈ పరిణామాలు జిల్లాలో పార్టీ నాయకత్వంపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. 2024 ఎన్నికల పరాజయం నుంచి పూర్తిగా కోలుకుని కార్యకర్తల్లో నమ్మకం పెంచడం, కొత్త వ్యూహాలతో ముందుకు సాగడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక సవాలుగా మారింది.అయితే రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులను పార్టీ ఎలా అధిగమిస్తుంది, జిల్లాలో తిరిగి తన బలాన్ని ఎలా పెంచుకుంటుంది, కీలక నాయకులు తమపై వచ్చిన వివాదాలను ఎలా ఎదుర్కొంటారు అన్నదే రానున్న రోజుల్లో శ్రీకాకుళం జిల్లా రాజకీయాల దిశను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనుంది.

## 13 మంది మంత్రులకే డేంజర్ బెల్స్

విజయవాడ, జూలై 23, ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే రెండేళ్లు పూర్తి చేసుకుంది. గత ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయిన వైఎస్సార్‌సీపీ అసలు ఇప్పట్లో పుంజుకుంటుందా ? ఆ పార్టీ కేడర్ రోడ్డెక్కుతారా ? అన్న సందేహాలు అందరిలోనూ కలిగాయి. కానీ ఆశ్చర్యంగా రెండేళ్లకే ఆ పార్టీ నాయకత్వం ఇస్తోన్న పిలుపునకు వైసీపీ కేడర్ ఉత్సాహంగా రోడ్లెక్కేస్తున్నారు. వైసీపీ ఇంత త్వరగా కోలుకుని మూడు పార్టీల కూటమి ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. దీనికి చాలా కారణాలు, తప్పులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం అయిపోయింది. ఎమ్మెల్యేలు ఎవ్వరూ ముఖ్యమంత్రి లేదా తమ పార్టీ అధినేతలు చెప్పినట్టు వినే పరిస్థితి లేదు. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయింది. చంద్రబాబు గతానికి భిన్నంగా ఈ సారి తన కేబినెట్లో కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. వాళ్లలో ఎక్కువ మంది తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన వారు కూడా ఉన్నారు. వీళ్లు తమ శాఖల పరంగా పట్టు సాధించడంలోనూ , ఇటు పార్టీకి ఉపయోగపడడంలోనూ దారుణంగా విఫలమవుతున్నారు. తెలుగుదేశం నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న వారిలో ఏకంగా 13 మంది కొత్తవాళ్లే ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇదే కేబినెట్‌తో చంద్రబాబు ఎన్నికలకు వెళితే ఖచ్చితంగా ఇబ్బందులు తప్పవని పార్టీలో సీనియర్ నాయకులు తమ అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు.శాఖలకు మంత్రులుగా ఎవరు ఉన్నా .. జిల్లాల పరంగా పవర్ ఫుల్ వ్యక్తులు లేకపోతే ఖచ్చితంగా అది ఎన్నికలపై, జిల్లా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు మరో మూడేళ్ల టైం కూడా లేదు.. అందుకే డైనమిక్‌గా ఉండేవాళ్లకే కేబినెట్లో చోటు కల్పించాల్సిన అవసరం ఉంది. కేబినెట్లో ఉన్న మంత్రుల్లో ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై కూడా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఎంతమాత్రం సంతృప్తిగా లేరని అంటున్నారు. దసరాకు కాస్త అటూ ఇటూగా కేబినెట్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చని అంటున్నారు. ఫస్ట్ టైం ఛాన్స్ మిస్ అయ్యిన వారికి రెండో విడతలో ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తారని అంటున్నారు.తొలిసారి కేబినెట్లో చోటు దక్కించుకున్న వాళ్లలో అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, సుభాష్, సవిత, టి జీ భరత్, బి సి జనార్దన్ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యా రాణి, డోలా బాల వీరాంజనేయ స్వామి ఉండగా.. వీరిలో సగానికి పైగా మంత్రుల పనితీరు అసలు ఏ మాత్రం బాగోలేదంటున్నారు. విచిత్రం ఏంటంటే సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నచోట కూడా ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఆర్థికశాఖలపై కూడా ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లో అంత సంతృప్తి లేదంటున్నారు ఇక అన్నింటికి మించి కూటమి ప్రభుత్వంలో బిల్స్ వైసీపీ నేతలు చెప్పిన వాళ్లకు క్లీయర్ అవుతున్నాయన్నది బయటకు వచ్చేసింది. టీజీ భరత్ వివాద రహితుడే అయినా ఆయన శాఖ ఆయన చేతుల్లో లేదంటున్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ, పెట్టుబడి వచ్చినా అది లోకేష్ ఖాతాలోకి వెళ్లిపోతోంది. కొన్ని పరిశ్రమల ప్రారంభోత్సవానికి కూడా సంబంధిత శాఖా మంత్రికి ఆహ్వానం ఉండడం లేదని సచివాలయ వర్గాల్లో చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా అటు మంత్రుల పట్ల, ఇటు ప్రభుత్వం పట్ల, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ప్రజలు అయితే సంతృప్తిగా లేకపోవడంతోనూ రెండేళ్లకే ఇంత వ్యతిరేకత కనపడుతోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ..

### కూటమి ప్లాన్ అదుర్స్

విజయవాడ, జూలై 23, కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది.పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్ను హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్‌ను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది.పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

# కాపు నేతల తిరుగుబాటు

రాజమండ్రి జూలై 23, కాపు అస్త్రంతో కూటమిని చీల్చాలని జగన్మోహన్ రెడ్డి భావించారు. ఇప్పుడు అదే కాపు అస్త్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గుచ్చుకోబోతోంది. కూటమిని ఇరకాటంలో పెట్టేందుకు, కాపు ఓటు బ్యాంకు ను ఆకట్టుకోవడానికి కాపుల అంశాన్ని ఒక రాజకీయ రణరంగంగా మార్చాలని జగన్ భావించారు. కానీ ఆ ప్రయత్నం వికటించి.. చివరకు సొంత పార్టీలోనే నిప్పు పెట్టబోతోందని సంకేతాలు వెలువడుతున్నాయి. పార్టీ లైన్ దాటి వైసిపి కాపు నేతలు వ్యవహరిస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా కాపు రిజర్వేషన్ల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. వైసిపి కాపు నేతలే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చి పార్టీని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తుండడం విశేషం.కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగింది. అయితే సభకు హాజరైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతలు కాపు రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించారు. నిన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా.. చాలా జాగ్రత్తగా మసులుకున్నారు నేతలు. ఇప్పుడు హఠాత్తుగా కాపు రిజర్వేషన్ల అజెండాను భుజానికి ఎత్తుకోవడం వెనుక సొంత పార్టీపై తిరుగుబాటు అన్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఎందుకంటే చంద్రబాబు ఇచ్చిన ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్లను కాపులకు నిలిపివేశారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు అదే కాపు రిజర్వేషన్లను ప్రస్తావించడం ద్వారా తమ అధినేత చేసిన తప్పిదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నారు.2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ల హామీ ఇచ్చారు చంద్రబాబు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయనందున ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అది పతాక స్థాయికి చేరుకోవడంతో చంద్రబాబు ప్రభుత్వం కాపులకు ఐదు శాతం ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లను కేటాయించింది. కాపులు ఆర్థికపరమైన పథకాలను సొంతం చేసుకున్నారు. అయితే ఆ రిజర్వేషన్లను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు జగన్ మోహన్ రెడ్డి. రిజర్వేషన్లు అనేది కేంద్రం పరిధిలోని అంశం అని.. అది తన వల్ల కాదు అని తేల్చి చెప్పారు. అయితే అప్పట్లో ఏ కాపు నేత కూడా దానిని వ్యతిరేకించలేదు. కాపుల్లోకి ఇది బలంగా వెళ్లడంతో 2024 ఎన్నికల్లో విపరీతమైన ప్రభావం చూపింది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతలు రిజర్వేషన్ల విషయం ప్రస్తావించారు. కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది జగన్ వైఖరికి పూర్తి భిన్నం. మరోవైపు కాపు ఐక్యత సభకు సంబంధించి టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావుకు మద్దతు తెలిపారు తోట త్రిమూర్తులు. ఇది కూడా జగన్మోహన్ రెడ్డిలో అసహనం రేపుతోంది. అయితే కాపుల పేరుతో జగన్ ఆడిన రాజకీయ క్రీడా ఇప్పుడు రివర్స్ గేర్ లో ఆయనకి దెబ్బ కొడుతోంది.

# బెంగాల్ లో ఊపిరిపోసుకుంటున్న లెఫ్ట్ పార్టీలు

కోల్ కత్తా, జూలై 23,పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన తృణమూల్ కాంగ్రెస్ నేడు తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని నిలబెట్టేందుకు పడుతున్న ఆరాటం, సీనియర్ నేతల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అధికారం పోవడంతో పార్టీ ముఖ్యనేతలందా గుడ్ బై చెప్పేశారు. ప్రతిపక్ష రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సీపీఎంకు ఓ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఈ రాజకీయ పరిణామం సుదీర్ఘకాలం 34 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఖఎ-ఓ కి, లెఫ్ట్ ఫ్రంట్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని తలుపు తడుతోంది. 2011లో మమతా తుఫాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత, సురక్షిత స్థావరం కోసం సీపీఎం కేడర్ పెద్ద ఎత్తున బిజెపి, టిఎంసి వైపు వలస వెళ్లారు. అయితే, గ్రామీణ బెంగాల్‌లో సీపీఎం నిశ్శబ్ద మూలాలు, సైద్ధాంతిక బలగాలు నేటికీ చెక్కుచెదరలేదు. తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలికంగా ఇతర జెండాలు పట్టిన శ్రేణులు, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం, మమతా పార్టీ నిర్వీర్యం అవుతున్న సూచనలు కనిపిస్తూండటం?త మళ్లీ ఎర్రజెండా వైపు చూస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ నేతలు పాత పద్ధతులను విడనాడి, కొత్త వ్యూహాలతో శ్రేణులను జాగృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మీనాక్షి ముఖర్జీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన యువనాయకులను ముందుంచి, కార్మికులు-రైతులు-యువత అజెండాతో బెంగాల్‌ను కాపాడుకుందాం పేరిట విస్తృత పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మత-కులాతీత రాజకీయాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా సీపీఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది అయితే, సైద్ధాంతికంగా సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ఆచరణలో సీపీఎం ముందు కొండంత సవాళ్లు నిలిచాయి. దశాబ్దకాలంగా అమానుష దాడులకు గురై దెబ్బతిన్న గ్రామస్థాయి కార్యకర్తలకు మాస్ ప్రొటెక్షన్ కల్పించడంలో పార్టీ అగ్రనాయకత్వం ఇంకా సంపూర్ణ విశ్వాసాన్ని నింపలేకపోతోంది. పైగా, కాంగ్రెస్ పార్టీతో చేసుకుంటున్న తాత్కాలిక పొత్తులు క్షేత్రస్థాయిలో ఓటర్లలో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. తమ పూర్వపు ఓటు బ్యాంకును ఆకర్షించడంలో లెఫ్ట్ ఫ్రంట్ వేస్తున్న అడుగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా చాలా పోరాటం చేయాల్సిఉంది. తృణమూల్ ఎంత బలహీనపడితే సీపీఎంకు అంత మేలు జరుగుతుంది.పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా అవతరించే అర్హత, సైద్ధాంతిక పునాది సీపీఎంకి మాత్రమే ఉన్నాయి. బీజేపీ వైపు వెళ్లిన తమ పాత ఓటర్లను ఇంటికి రప్పించడంలోనూ, యువతలో ఉపాధి రాజకీయాల పట్ల నమ్మకం కలిగించడంలోనూ సీపీఎం నేతలు ఎంతవరకు సఫలమవుతారో అనే దానిపైనే బెంగాల్‌లో ఎర్ర సూర్యుడి పునరాగమనం ఆధారపడి ఉంటుంది.

# ఆందోళనలతో ఢిల్లీ...

న్యూఢిల్లీ, జూలై 23, ఢిల్లీ నగరం ఆందోళనలతో అట్టుడికి పోతుంది. గతంలో కేంద్రం వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. అప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన కొంతమంది రైతులు అందులో పాల్గొన్నారు. ఇదే అదునుగా ఖలీస్థానీ వేర్పాటు వాదులు అందులోకి ప్రవేశించారు. సరిగ్గా గణతంత్ర దినోత్సవం జరిగిన తర్వాత ఎర్రకోట మీద ఖలీస్థానీ జెండా ఎగరవేశా. దీంతో ఈ రైతు ఉద్యమం వెనుక ఉన్న అజెండా ఏమిటో అందరికీ అర్థమైంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. తద్వారా యూపీ ఎన్నికల్లో విపక్ష పార్టీలు ఊహించని విధంగా స్కెచ్ వేశారు. దీంతో ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మనదేశంలో ఉద్యమాల వెనుక ఉన్న శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయో నాడు ఈ సంఘటన బయటకు తెలిసేలా చేసింది.ఇప్పుడు ఢిల్లీలో కొంతమంది ఉద్యమాలు చేస్తున్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నీటి పేపర్ లీకేజీ.. విద్యార్థుల ఆత్మహత్యలు వంటిఘటనలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇటీవల సోనం వాంగ్ చుక్ నిరధిక నిరాహార దీక్షకు దిగారు. ఆ తర్వాత ఆయన దీక్షను ప్రభుత్వం విరమింపజేసింది. ఆయన ఢిల్లీలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సరిగా నిన్న ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. చలో పార్లమెంట్ నినాదంతో ఢిల్లీ నగరంలో హడావిడి చేశారు. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పడంతో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కిసాన్ ఘాట్ వద్ద రైతులు నిరసన తెలపడం మొదలుపెట్టారు. వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. భారత్ ? అమెరికా వాణిజప్పంలో భాగంగా తక్కువ ధరకు.. రాయితీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్లే శంభు బార్డర్ (పంజాబ్, హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకున్నారు.అటు బొద్దింకలు.. ఇటు రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి బిజెపికి విపత్కర పరిస్థితి తప్పదా అంటూ విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కూడా రైతుల ఉద్యమం ముసుగులో చాలామంది ఢిల్లీలో తిష్ట వేసుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే పోలీసులు సమర్థవంతంగా అడ్డుకోవడంతో వారి పాచికలు పారలేదు. ఇప్పుడు మళ్లీ నీట్.. అమెరికా ఒప్పందం వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. అయితే దీని వెనక కూడా విదేశీ శక్తులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అందువల్లే ఈ ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కి వేస్తున్నాయి.

## శాన్వి డిఫెన్స్ అకాడమీ సేవలు అభినందనీయం
## మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ విద్యార్థులకు విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందిస్తూ దేశ సేవ దిశగా తీర్చిదిద్దుతున్న శాన్వి జూనియర్ కళాశాల ఒ డిఫెన్స్ అకాడమీ అభినందనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. “కమ్ టు లెర్న్? గో టు సర్వ్” అనే నినాదంతో యువతను సైన్యం, రక్షణ రంగం, సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. సామాజిక కార్యకర్త అరెశెట్టి మునిందర్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హ్యాట్రిక్ కోసం యోగీ వ్యూహాలు



లక్నో జూలై 23,ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం దేశవ్యాప్తంగా పాలనా అధికారం కోసం పోటీపడే ఏ పార్టీకైనా అత్యంత కీలకమైన మెట్టు. ఈ రాష్ట్రం 80 లోక్‌సభ స్థానాలతో దేశంలోనే అత్యధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. పశ్చిమ భారతదేశం మొత్తం కలిపినా ఇంతకంటే తక్కువ స్థానాలు ఉంటాయి. తూర్పు భారతదేశం సీట్ల సంఖ్యతో యూపీ సమానంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారం నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలనే ప్రయత్నంలో పార్టీ ఇప్పటి నుంచే గ్రాస్‌రూట్స్ స్థాయిలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.2019లో బీజేపీ యూపీలో 62 సీట్లు గెలవగా, 2024లో కేవలం 33 సీట్లకు పరిమితమైంది. ఈ భారీ పతనం పార్టీని ఆత్మపరిశీలనకు దారితీసింది. 400 సీట్ల టార్గెట్‌ను చేరుకోలేకపోవడం వెనుక యూపీలోని నష్టాలు ప్రధాన కారణం. ఇకపై కులం, మతం ఆధారంగా కాకుండా పనితీరు, పాలనా ఫలితాల ఆధారంగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మార్పు యోగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రజల ముందు పెట్టడం ద్వారా విశ్వాసం పెంచే దిశగా ఉంది.బీజేపీ 18 జిల్లాల్లోని 64 అసెంబ్లీ స్థానాలను ‘స్వింగ్ సీట్లు’గా గుర్తించి, వాటిపై ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఇక్కడ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఓట్ల శాతం, ఇతర పార్టీల పనితీరు వివరంగా విశ్లేషించబడుతోంది. ఈ సీట్లలో బీజేపీ 10 వేల ఓట్లలోపు మెజారిటీతో ఓడిపోయినట్లు గుర్తించింది. ఇవి త్వరగా తిరిగి సాధించగల స్థానాలుగా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి, సంఘటన మంత్రి ధరమ్‌పాల్ సింగ్ ఈ 64 సీట్లను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించి, వారిని ఎన్నికల వరకు అక్కడే ఉంచి క్షేత్రస్థాయి పని చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది వనరులను సమర్థవంతంగా వినియోగించి, లక్ష్య సాధనకు సహాయపడే విధానం.హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అమలు చేసిన వ్యూహాల నుంచి యూపీకి పాఠాలు నేర్చుకుంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో కూడా బీజేపీ 14 దళాలతో సంస్థాగతంగా బలపడింది. 44 ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లోనూ, మిగతా ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమావేశాలు నిర్వహించి, వాలంటీర్లను నియమించి గ్రాస్‌రూట్స్ స్థాయిలో పని చేసింది. ఇదే తరహా విధానాన్ని యూపీలో కూడా అమలు చేస్తోంది. ఇప్పటికే యూపీలో 15 వేల గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపు రోజుకు 30 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక వేసింది. ఎన్నికల నాటికి ఐదు లక్షల సమావేశాలు జరిపి, ప్రజాభిప్రాయాన్ని తన వైపుకు మళ్లించాలని లక్ష్యం. ఈ సమావేశాల ద్వారా పార్టీ పాలనా ఫలితాలు, యోగి ప్రభుత్వం చేసిన పనులు నేరుగా ఓటర్లకు చేరవేయడం, అనుమానాలు నివృత్తి చేయడం సాధ్యమవుతుంది.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 40 లక్షల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలు విని, పార్టీ, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతప్తిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు, నిజమైన అభిప్రాయ సేకరణ మరియు సమస్య పరిష్కార విధానం. 64 స్వింగ్ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఈ పని మరింత తీవ్రంగా జరగనుంది. ఈ విధానం ద్వారా బీజేపీ ‘పాలనా పనితీరు’ను ప్రధాన అంశంగా ముందుకు తెచ్చి, సాంప్రదాయకంగా జరిగే ఓటు బ్యాంకు రాజకీయాలను అధిగమించాలని చూస్తోంది.బీజేపీ వ్యూహం రెండు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉంది. ఒకటి ? లక్ష్య సాధన. 64 స్వింగ్ సీట్లపై దృష్టి పెట్టడం వల్ల వనరులు వృథా కాకుండా, ఫలితాలు త్వరగా రావచ్చు. రెండు ? గ్రాస్‌రూట్స్ సంస్థాగతీకరణ.

ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన మోడల్‌ను అనుసరించడం వల్ల అనుభవం ఉంది. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు బీజేపీని ఆపడానికి కలిసి పని చేయవచ్చు. యోగి ప్రభుత్వం చేసిన పనులను ఓటర్లు ఎంతవరకు గుర్తిస్తారు, స్థానిక అసంతృప్తులు ఎంతవరకు తొలగుతాయి అనేది నిజమైన పరీక్ష.మొత్తంమీద బీజేపీ ఇప్పటి నుంచే సమగ్రమైన, క్షేత్రస్థాయి కేంద్రిత వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2027లో యోగి ఆదిత్యనాథ్ మూడోసారి సీఎంగా రావాలంటే ఈ స్వింగ్ సీట్లు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

# నిలిచిపోయిన ఊరు-వాడ

హైదరాబాద్ జూలై 23, వంద కోట్లతో సోషల్ సర్వీస్ చేస్తాం? గ్రామాలను తీర్చిదిద్దుతాం? ప్రజాసమస్యలను పాలకుల దగ్గరకు చేరుస్తామంటూ భారీ ఎలివేషన్లు ఇచ్చిన సంస్థ.. షట్‌డౌన్ చేస్తున్నట్టు సంచలన ప్రకటన చేసింది. అసలింతకి ఏం జరిగింది?? ఎన్టీఆర్ చెప్పినా ప్రజాసేవ ఆపేదేలేదన్న నిర్వాహకులు ఎందుకు వెనక్కి తగ్గారు?? కావాలనే ఆగిపోయారా?? ఎవరైనా ఆపేశారా?? అనేది సంచలనంగా మారింది.. సోషల్ మీడియా సెన్సేషన్.. రా ఎన్టీఆర్ సంస్థ బుధవారం సడెన్‌గా యూటర్న్ తీసుకుంది. తమ సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఎక్స్‌లో ప్రకటించడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఇది ఎన్టీఆర్ అభిమానుల ఒత్తిడితో జరిగిందా?? లేక ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి డైరెక్ట్ మెసేజ్ ఏమైనా వెళ్లిందా?? లేకపోతే మరెవరి ప్రమేయమైనా ఉందా?? అన్న చర్చ సోషల్ మీడియాలో రచ్చ లేపుతోంది. రా ఎన్టీఆర్ సంస్థను నిలిపివేస్తున్నామని చెప్పడంతో పాటు? ఇందులో విషయం సాధించిన వారందరికి అభినందనలని ఫినిషింగ్ టచ్ ఇవ్వడం సరికొత్త చర్చకు తెరలేపింది. ఊరు?వాడ పేరుతో సుమారుగా 100 కోట్ల సేవా యజ్ఞం చేపడుతున్నట్టు రా ఎన్టీఆర్ సంస్థ ఆర్గనైజర్ సాయి రూప్ ఓ సంచలనమే సృష్టించారు. ఫ్యాన్స్ వద్దన్నా? తమ హీరో ప్రతిష్ట దెబ్బతింటుందని పలువురు కంప్లైంట్ చేసినా? రా ఎన్టీఆర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చినా ఏమాత్రం తగ్గకుండా ఈనెల 18న తిరుపతిలో మీటింగ్ పెట్టి తమ అజెండా ఏంటో వివరించారు సంస్థ ఆర్గనైజర్ సాయిరూప్. అభిమాని అంటే నలుగురికి ఉపయోగపడాలి అనే ఎన్టీఆర్ మాటను దృష్టిలో పెట్టుకొనే సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎవరు అడ్డొచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా సేవ చేస్తామని రా ఎన్టీఆర్ సంస్థకు భారీ ఎలివేషన్లిచ్చారు. కట్ చేస్తే? క్లోజ్ బటన్ నొక్కి ఇప్పుడందరిని షాక్‌కు గురిచేశారు.అయితే? ఎందుకు వెనక్కి తగ్గారో, సంస్థను ఎందుకు మూసివేస్తున్నారో అన్న విషయాలపై రా ఎన్టీఆర్ నిర్వాహకులు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కానీ 100 కోట్లు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి అన్న ప్రశ్నలకు సాయి రూప్ దగ్గర స్పష్టమైన సమాధానం లేకపోవడం, ఫలితంగా పెద్దఎత్తున విమర్శలు రావడమూ ఓ కారణంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు ఎన్టీఆర్ అభిమానుల సంఘం కన్వీనర్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఆఫ్టర్ ప్రెస్‌మీట్ రా ఎన్టీఆర్ సంస్థపై విమర్శలు మరింత పెరిగాయి. దీంతోనే రా ఎన్టీఆర్ సంస్థ సేవలను నిలిపివేసిందన్న ప్రచారమూ జరుగుతోంది.మరోవైపు ఊరు-వాడ కార్యక్రమాన్ని క్యాన్సిల్ చేయాలని ముగ్గురు బలమైన వ్యక్తులు పోరాడుతున్నారు అంటూ తనదైన శైలిలో కామెంట్లు చేశారు సాయిరూప్. అయితే? ఇప్పుడు వారి మాటలు నిజమయ్యాయా.. నిజంగానే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయడానికి కొన్ని శక్తులు పోరాడాయా?? అందుకే విజయం సాధించిన వారికి అభినందనలు అంటూ రా ఎన్టీఆర్ ఇలాంటి పోస్ట్ పెట్టిందా?? అంటూ పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా? ఇప్పుడు సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం కావాలంటే రా ఎన్టీఆర్ ఆర్గనైజర్ సాయిరూప్ మళ్లీ మాట్లాడాల్సిందే.

# ఫస్ట్...లాస్ట్... తెలంగాణనే

హైదరాబాద్, జూలై 23, కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (ఖఉఎ) 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట-3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. తరగతి గదిలో బోధన, విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలు ఇంకా తీవ్ర ఆందోళనకరంగానే ఉన్నాయని ఈ అంకెలు తేటతెల్లం చేస్తున్నాయి.మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కూడా విద్యాశాఖను వేధిస్తోంది.ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో కేటాయించిన 190 మార్కులకు 91.9 మార్కులు సాధించి రాష్ట్రం 20వ స్థానంలో నిలిచింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన శౌచాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేవలం ఓవరాల్ ర్యాంకింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్యనందించడంతో పాటు టీచర్ల శిక్షణ, మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

# హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..

## రూ.345 కోట్లతో 6 లేన్లు.. మరింత వేగంగా ఎయిర్‌పోర్టుకు ప్రయాణం

హైదరాబాద్, జూలై 23,హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జీహెచ్ఎంసీ మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు రెడీ అయింది. రూ.345 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, ఎల్‌బీ నగర్, కంచన్‌బాగ్, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు మరింత వేగంగా ప్రయాణం సాగనుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా ఆదా కానుంది. ఈ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను జీహెచ్ఎంసీ వేగవంతం చేస్తోంది.హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పాతబస్తీ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే లక్ష్యంతో కీలక ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు సిద్ధమైంది. మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు ఆరు లేన్ల గ్రేడ్ సెపరేటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది.సుమారు రూ.345 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్‌కు పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అధికారిక ఆమోదం కోసం ఎదురుచూస్తూనే ప్రాజెక్టు ఆలస్యం కాకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, శంషాబాద్ రోడ్ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకం అనుభవించే వాహనదారులకు భారీ ఉపశమనం లభించనుంది.ముఖ్యంగా పాతబస్తీ, కంచన్‌బాగ్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓవైసీ ఫ్లైఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ దాటిన తర్వాత మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ కారణంగా ఆ మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా అవసరమైన భూసేకరణ ప్రక్రియపై కూడా జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. భూమి యజమానులకు ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వడం లేదా అవసరమైతే నష్టపరిహారం చెల్లించడం ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర దక్షిణ భాగంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడి.. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి కొత్త ఊపు రానుంది.

# హరీష్ ఇంపాక్ట్ ...పాదయాత్రలో తగ్గని క్రేజ్

మెదక్, జూలై 23,తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గొదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది.కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత సమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ పవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు. వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన పునరు త్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.

# ఖాళీగా కనిపిస్తున్న జలాశయాలు

హైదరాబాద్, జూలై 23, ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యాయి. కానీ, ప్రధాన నదులపై ఉన్న జలాశయాలకు ఇప్పటివరకు నీటి ప్రవాహం రాలేదు. శ్రీశైలం జలాశయానికి కేవలం 5.9 టీఎంసీల నీరు మాత్రమే చేరింది, అది కూడా స్థానిక వర్షాల వల్ల. సాధారణంగా జూన్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ, జులైలో కనీసం 200 టీఎంసీల వరద వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. గత 25 సంవత్సరాలలో, ఖరీఫ్‌లో జూన్ మరియు జులైలో శ్రీశైలానికి 10 టీఎంసీల కంటే తక్కువ నీటి ప్రవాహం వచ్చిన సంవత్సరాలు 6 ఉన్నాయి. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఇది రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది.కర్ణాటకలోని ఆల్మట్టిలో ప్రస్తుతం 47 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది, కానీ ఆల్మట్టికి నిండటానికి ఇంకా 28 టీఎంసీల నీరు అవసరం. నారాయణపూర్‌కు 12 టీఎంసీల నీరు కావాలి. జులైలో ఆల్మట్టిలో పూర్తి స్థాయి నీటి నిల్వ జరగకూడదు. అయితే, ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చిన నీటిని నిల్వ చేస్తున్నారు, దీనిని హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కోసం మరియు కాలువల కింద సాగుకు ఉపయోగిస్తున్నారు. ఈ నెలలో జూరాలకు నీటిని విడుదల చేయడం కష్టమవుతుంది, ఎందుకంటే ప్రవాహం పెరగకపోతే, నాగార్జునసాగర్ మరియు శ్రీశైలం జలాశయాలపై ప్రభావం ఉంటుంది.గోదావరి నదిలో కూడా పరిస్థితి అంతే. ప్రాణహిత నదిలో కూడా ఈ ఏడాది తక్కువ వరద ఉంది. మేడిగడ్డ వద్ద 16,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది, ఇది మంగళవారం 16,620 క్యూసెక్కులుగా ఉంది. రాష్ట్రానికి గోదావరి నదిపై ఎగువన ఉన్న శ్రీరామసాగర్‌కు 2,199 క్యూసెక్కుల నీరు వస్తోంది. కానీ దిగువన ఎల్లంపల్లిలోకి కేవలం 963 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, వ్యవసాయ శాఖ అత్యవసర ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జిల్లాలవారీగా సాగుకు అనువైన పంటల గురించి సమాచారాన్ని అందించనుంది.

# ఎడ్యుకేషన్ హబ్ గా హైదరాబాద్

హైదరాబాద్, జూలై 23, తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి (ట్రైసిటీస్) జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, అత్యధిక సంఖ్యలో కాలేజీలు కలిగిన జిల్లాల జాబితాలో ఈ మూడు జిల్లాలు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ కోర్సులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగంతో పాటు మహిళల భాగస్వామ్యం ఊహించని స్థాయిలో పెరగడం తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా మరింత బలపడుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా నివేదికలో ఈ మూడు జిల్లాలు దేశంలో అత్యధిక కాలేజీలు ఉన్న జిల్లాల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచాయి. విస్తృతంగా పెరిగిన విద్యాసంస్థలు, ఆధునిక కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, ఐటీ రంగం విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న విద్యా విధానాలు ట్రైసిటీస్‌ను దేశంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా నిలబెట్టాయని నివేదిక స్పష్టం చేసింది.హైదరాబాద్ జిల్లాలో 480కు పైగా, రంగారెడ్డి జిల్లాలో 390కు పైగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 310కు పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. సంప్రదాయ డిగ్రీ కళాశాలలతో పాటు వైద్య, న్యాయ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి విభిన్న రంగాల్లో విద్యను అందించే సంస్థలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ప్రతి లక్ష జనాభాకు లభిస్తున్న కాలేజీల సంఖ్య కూడా ఈ జిల్లాల్లో ఎక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది.గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, స్టార్టప్ రంగాలకు కేంద్రంగా ఎదగడం ఉన్నత విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు భారీగా డిమాండ్ పెరిగింది. నివేదిక ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 45 శాతానికి పైగా విద్యార్థులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీ రేటు గతంతో పోలిస్తే మెరుగుపడిందని సర్వే తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరగడం, పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అధికంగా లభించడం వల్ల విద్యార్థులు ఈ ప్రాంతంలోని కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది.మహిళల ఉన్నత విద్యలో పాల్గొనడంలో కూడా ట్రైసిటీస్ విశేష పురోగతి సాధించాయి. ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ కోర్సులకే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఇంజినీరింగ్, టెక్నాలజీ, పరిశోధన, సైన్స్ రంగాల్లో కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నత విద్యలో అమ్మాయిల నమోదు అబ్బాయిల కంటే ఎక్కువగా నమోదైంది. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధన కోర్సుల్లో మహిళల నమోదు జాతీయ సగటును మించి ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా నివేదిక పేర్కొంది. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కూడా ఇందుకు కారణాలుగా గుర్తించింది.మౌలిక వసతుల పరంగా కూడా హైదరాబాద్ ట్రైసిటీస్ దేశంలోని ఇతర విద్యా కేంద్రాలకు పోటీ ఇస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 90 శాతానికి పైగా కాలేజీల్లో వైఫై, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని సర్వే తెలిపింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం పెరగడంతో ల్యాబ్‌ల ఆధునీకరణ కూడా వేగంగా జరుగుతోందని పేర్కొంది. కౌన్సెలింగ్ కేంద్రాలు, పరిశోధన ఇంక్యుబేషన్ సెంటర్లు, క్రీడా వసతుల కల్పనలో కూడా ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించింది.అయితే విద్యార్థుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాస్టల్ సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. అధ్యాపకుల ఖాళీల భర్తీ, పరిశ్రమలతో మరింత అనుసంధానం, పరిశోధనకు ప్రాధాన్యం పెంచడం వంటి చర్యలు చేపడితే హైదరాబాద్ ట్రైసిటీస్ దేశానికే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ నివేదిక అభిప్రాయపడింది.

# సొంత పార్టీపై విమర్శలు

హైదరాబాద్, జూలై 23, బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాథులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పోరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

# యూత్ కాంగ్రెస్ అందోళన

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

రామడుగు నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షుడు అనుపురం పరుశురాం గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రామడుగు మండల కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అనుపురం పరుశురాం గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కష్టాన్ని, వారి కలలను నీరుగార్చే విధంగా జరిగిన ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను వెంటనే శిక్షించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్ యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మల్యాల అక్షయ్ కుమార్ మిల్కీ సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ రంగు శ్రీనివాస్ బీమా ఈశ్వర్ అనుపూరం సంజీవ్ భువన్ కుమార్ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.సురేందర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించాలి

### ముఖ్యమంత్రికి మైనారిటీస్ సెక్యులర్ ఫ్రంట్ విజ్ఞప్తి




హైద్రాబాద్ జులై 23; కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఆర్ సురేందర్ రెడ్డి ని రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులుగా నియమించాలని మైనార్టీస్ సెక్యులర్ ఫ్రంట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. గురువారం ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్ కమల్ కొందుమెరిమాట్లాడుతూ సురేందర్ రెడ్డి ఎంపీగా ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని ఆయన పేర్కొన్నారు అంతేకాకుండా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘమైనదని ఆయన పేర్కొన్నారు ఇట్టి విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు వినతి పత్రాలు కూడా సమర్పించినట్లు ఆయన తెలిపారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సురేందర్ రెడ్డి సేవలను గుర్తించి ఆయనను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫ్రంటు ఉపాధ్యక్షులు షఫీ అకి ఖాన్, ప్రధాన కార్యదర్శి మజార్ పాష తదితరులు పాల్గొన్నారు.

## డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో

### ఆనాథ విద్యార్థు లకు నోట్‌బుక్స్ పంపిణీ




హైదరాబాద్, (ఎల్‌బీ నగర్) జులై 23; ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు ఎల్‌బీ నగర్‌లోని ఆనాథ విద్యార్థి గృహంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా 5,000 నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించి, వారి చదువుకు ప్రోత్సాహం కల్పించారు. విద్య ప్రతి చిన్నారి హక్కు అనే భావనతో సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన మరియు అనాథ విద్యార్థులకు చేయూత అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఈ సందర్భంగా ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం కావాలంటే సమాజం మొత్తం కలిసి వారికి అండగా నిలవాలని, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ఆనాథ విద్యార్థి గృహం యాజమాన్యానికి, దాతలకు, వాలంటీర్లకు మరియు సొసైటీ సభ్యులకు సొసైటీ ఎక్సగ్యుటీ డైరెక్టర్ జి.మాధవి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మురికి కూపాలుగా మారుతున్న చెరువులు

### (హెచ్.ప్రతాప్)

తెలంగాణలో చెరువులు, కాలువలు, వాగులు ఒకప్పుడు గ్రామీణ జీవనానికి జీవనాధారాలుగా నిలిచాయి. సాగునీరు, భూగర్భ జలాల పెంపు, జీవవైవిధ్య పరిరక్షణలో అవి కీలక పాత్ర పోషించాయి. అయితే ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చెరువుల్లో మురుగు నీరు చేరడం, కలుపు మొక్కలు విస్తరించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం, కాలువలు పూడిపోవడం ఆందోళన కలిగించే పరిణామంగా మారింది. ఇటువంటి పరిస్థితులు కేవలం ఒక జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అనేక పట్టణాలు, గ్రామాల్లో కనిపిస్తున్నాయి.

చెరువులు మురికికూపాలుగా మారితే వర్షపు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. మురుగు నీరు కలవడం వల్ల నీటి నాణ్యత క్షీణించి, పశువులు, పక్షులు, జలచరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి స్థానికంగా వరద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉంది. చెరువులు, కుంటలు, కాలువల నుంచి కలుపు మొక్కలను తొలగించడం, పూడికను క్రమం తప్పకుండా తీయడం, మురుగు నీరు నేరుగా జలాశయాల్లోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టడం అత్యవసరం. స్థానిక సంస్థలు, నీటిపారుదల శాఖ, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలి.

అంతేకాదు, పరిశుభ్రతను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే చూడకుండా ప్రజల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలి. చెరువుల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణలో యువత, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలను భాగస్వాములను చేయడం ద్వారా శాశ్వత ఫలితాలు సాధించవచ్చు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం తమ సమీప జలవనరులను పరిరక్షించుకునే బాధ్యతను స్వీకరించాలి.

తెలంగాణ అభివృద్ధికి చెరువుల పునరుజ్జీవనం ఎంత ముఖ్యమో, వాటి పరిశుభ్రత కూడా అంతే కీలకం. పరిశుభ్రమైన జలవనరులు ఆరోగ్యకరమైన సమాజానికి, సుస్థిర వ్యవసాయానికి, పర్యావరణ సమతుల్యతకు బలమైన పునాది. అందుకే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర పరిశుభ్రత ఉద్యమాన్ని తక్షణమే ప్రారంభించి, చెరువులను తిరిగి జీవంతో నింపాల్సిన సమయం ఆసన్నమైంది.

## కాంగ్రెస్ వి హింసాత్మక రాజకీయాలు: బీజేపీ నేత సునీల్ రావు

కరీంనగర్ నీట్ పరీక్షను సాకుగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ, కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ఆందోళనలను రెచ్చగొడుతోందని విమర్శించారు. పార్లమెంట్, పోలీసులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కాదని అన్నారు. పోటీ పరీక్షల లీకేజీలపై కాంగ్రెస్ గత పాలనలో ఎవరైనా మంత్రులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల హామీల అమలు ఎక్కడుందని నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, హింసాత్మక చర్యలను మాత్రం సహించబోమని సునీల్ రావు హెచ్చరించారు.

## వయోవృద్ధులు... జాగ్రత్త...!

### రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి



వికారాబాద్ జులై 23 ;: పెద్ద వయసు వారిలో "పడిపోవడం" పెద్ద సమస్య! మెట్ల మీద, స్నానాల గదిలో నునుపుగా ఉండే బండల మీద ఇలా ఎక్కడో చోట వృద్ధులు జారి పడిపోవడం, ఎముకలు విరగటం ముఖ్యంగా తుంటి కిలు విరిగి వారి జీవితం ఉన్నట్టుండి సమస్యల వలయముగా మారిపోవటం తరచూ చూస్తుంటాము. పైగా ఈ వయసుకు వచ్చేసరికి చాలామందికి ఎముకలు బోలుగా తయారై (ఆస్తియోపోరోసిస్) అవి తేలికగా కొద్దిపాటి ఒత్తిడికే విరిగిపోతుంటాయి. తర్వాత త్వరగా అతుకవు కూడా! దీనివల్ల కొన్నిసార్లు మంచానికే పరిమితం అవ్వాల్సిన పరిస్థితులు కూడాతలెత్తుతుంటాయి. వీటన్నిటికీ కారణం గా మలి వయసులో జారిపడటం, తుంటి ఎముక విరగటం అన్నది అతి పెద్ద వృద్ధాప్య సమస్యల తయారవుతుంది. కాబట్టి అసలీ విపత్తు తలెత్తకుండా చూసుకోవటమే మేలు. ఇంట్లో వృద్ధులు ఉన్నప్పుడు కొన్ని రకాల జాగ్రత్తలు అవసరమని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి సొసైటీ పేర్కొన్నారు. ఆ జాగ్రత్తలేమిటో సాయి చౌదరి మాటలలోనే తెలుసుకుందాం

ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ వైర్లు, తాళ్లు, బట్టలు వంటివి పడేసి ఉంటే అవి కాళ్లకు అడ్డుపడి వృద్ధులు పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైర్లు, తాళ్ళ వంటి వాటిని అన్నింటినీ నిర్లక్ష్యముగా నేల మీద వదిలేయకుండా జాగ్రత్తగా ఒక చోట చుట్టి పెట్టటం ముఖ్యం.

స్నానాల గదిలో "నాన్ స్కిడ్ టైల్స్" ని వాడాలి. దీని వల్ల అక్కడ పాకుడు పట్టడం, జారిపోవడం వంటి సమస్యలు ఉండవు.

చాలామంది ఇంట్లో సాక్స్ లు ధరించి నడుస్తుంటారు. కానీ అది మంచి పద్ధతి కాదు. నునుపైనా నేల మీద అవి తేలిగ్గా జారిపోతుంటాయి. రబ్బరు సోలు ఉన్న పాదరక్షలు ధరించడం మంచిది. అవి అంతగా జారిపోయే అవకాశం ఉండదు.

చాలాసార్లు పక్క మీంచి లేచేటప్పుడు దుప్పట్లు కాళ్లకు చుట్టుకుని పడిపోతుంటారు. కాబట్టి హడావుడిగా లేవకుండా... దుప్పట్లును జాగ్రత్తగా తీసి పక్కన పెట్టి అప్పుడు నిదానంగా లేచి కూర్చుని, అప్పుడు నిలబడటం అలవాటు చేసుకోవాలి.

వృద్ధులు తరచూ ఉపయోగించే మందుల వంటి వాటిని ఎక్కడో అందనంత ఎత్తులో పెట్టుకోవద్దు. స్టూలు వేసుకుని వాటిని అందుకునే క్రమంలో వాళ్లు పైనుంచి పడిపోవచ్చు.

ఒకవేళ పొరపాటున నీళ్ల లాంటివి ఇంట్లో నేల మీద ఉనికి పోతే అవే ఆరిపోతాయి లే అనే నిర్లక్ష్యము పనికిరాదు. మార్బుల్స్, గచ్చు మీద జారీ పడితే గాయాలు తీవ్రంగా ఉండే ప్రమాదముంది

చాలా ఇళ్లల్లో మెట్ల ప్రాంతము చీకటిగా ఉంటుంది. గదుల్లో తప్పించి మెట్ల దగ్గర ప్రత్యేకించి లైట్లేమి ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది పెద్దవాళ్లు రాత్రి పూట నిద్రమత్తులో పొరపాటున ఒకచోట అడుగు వేయబోయి మరోచోట వేస్తుంటారు. దీంతో జారిపడే గాయాల పాలవుతుంటారు. కాబట్టి మెట్ల దగ్గర మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. బద్ధక్కించకుండా లైట్ వేసుకుని మెట్ల మీద నడవాలి.

కొన్నిసార్లు మనం వాడే మందులు కూడా మగతకు కారణం అవుతాయి. అవి కూడా ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. కనుక వైద్యులు మగతగా ఉండని మందులు సిఫార్సు చేయమని కోరాలి. వృద్ధులు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం.

ఇంట్లో పెంపుడు కుక్కలు, పిల్లలు కూడా చాలాసార్లు దారిలో అడ్డంగా పడుకొని ఉంటాయి. పెద్దవాళ్ళు వీటిని చూడక కాలు తగిలి పడిపోతుంటారు. కాబట్టి పెంపుడు జంతువులకు ఇంట్లో ఏదో ఒక పక్కగా పడుకోవటం అలవాటు చేయాలి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు.

## ప్రతి ఒక్క సర్ ఫామ్ ను నింపి ఓటర్ గా పేరును నమోదు చేసుకోండి

### బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు




**రంగారెడ్డి(మణికొండ)జూలై 23;**ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరుగుతున్న విధి విధానాలకు గత కొన్ని రోజులుగా భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపుర్ డివిజన్ నాయకుల ప్రయత్నానికి, మద్దత్తుకు మణికొండ శివపురి కాలనీ అద్యక్షుడు మధు, సావిత్రి, హన్మంతు సాగర్, శ్రీనివాస్, తిరుపతి తదితర స్థానిక నివాసులు గురువారం రోజున హర్షం ప్రకటిస్తు ఇట్టి విషయమై స్థానికులు తమ వద్ద ప్రస్తుతం ఓటర్ కార్డు ఉన్నది కావున తాము మళ్లీ ఈ ఫారమ్ లు నింప వలసిన అవసరం లేదనె అభిప్రాయంతో వుంటిమనీ, అందుకు సంబంధించిన వివరాలను విఫలంగా విడమర్చి చెబుతూ ఇట్టి ప్రక్రియలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో – ప్రజల పాత్ర కూడా అంతే కీలకం అని, ప్రతి క్రియగా నివాసిత కుటుంబ సభ్యులు, ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటును 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో జత కలుపడం (మ్యాపింగ్ చేయడం) తప్పని సరి అని అప్పుడే తమ ఓటు హక్కు ఉంటుందని లేనిచో ఓటు గల్లంతగునని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు వివరించారు.




## విద్యార్థులతో చర్చలకు కేంద్రం పిలుపు



**హైద్రాబాద్ జులై 23** ;నీట్ లీకేజీపై ఢిల్లీలో ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కీలక ప్రకటన చేశారు. జబ్బీా నేతలు, విద్యార్థులను మరోసారి చర్చలకు ఆహ్వానించారు. 'మీకు అనుకూల సమయంలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే మేం 4 ప్రతిపాదనలు పంపాం. చర్చల్లో నేను, జీూ నడ్డా పాల్గొంటాం' అని తెలిపారు. జంతర్మంతర్ లేదా మరో తటస్థ ప్రదేశంలో చర్చలకు రావాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

## నేటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి ..

### మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 23 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిది లోని 6 వార్డు నందు జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి)3.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ కమిషనర్ మేదూరి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములు కావాలి వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత

అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటివృథాను నివారించాలని, భూగర్భజలాలను పెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపు నీటిసంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మనమందరం తోడ్పడవచ్చు.నీటి ప్రతి బొట్టు అమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనే ఈకార్యక్రమం విజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడమైనది.ఈ ప్రజాఉద్యమాన్ని విజయవంతంచేయడానికి వైరామున్సిపాలిటీతో కలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని నీటిసంరక్షణకు కట్టుబడి ముందుకు రావలసిందిగా మున్సిపల్ కమీషనర్ విజ్ఞప్తిచేస్తున్నారు.నీటిని ఆదా చేద్దాం -- భావితరాలకు భద్రతకల్పిద్దాం. ఈకార్యక్రమంలో "మున్సిపల్ కమీషనర్ మేదూరి రామచంద్రరావు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళికృష్ణ మున్సిపల్ మేనేజర్ సుధీర్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వెంకట్రావు మెప్మా ఆర్పి ఫాతిమా తోటకూర శ్రీకాంత్ వార్డు ప్రజలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు నేడే పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలి మండల అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జులై 23(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల కేంద్రంలోతెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారి ఆదేశానుసారం, నీట్ పరీక్ష లీకేజీ, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీ, అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారి అరెస్టుకు నిరసనగా మర్పల్లి మండల కేంద్రంలో నిరసన తెలియ జేసి కార్యక్రమం ఏర్పాటుచేయడమైన(శుక్రవారం) ఉదయం 10 గంటల కు స్థలం: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, మర్పల్లి మండల కేంద్రంకాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు,బ్లాక్ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మార్కెట్ కమిటీ చైర్మన్ ఁ వైస్ చైర్మన్ డైరెక్టర్లు,గాజూ చైర్మన్ ఁ వైస్ చైర్మన్ సొసైటీ డైరెక్టర్లు మండల పదాధికారులు , వార్డు మెంబర్లు,గ్రామ కమిటీ అధ్యక్షులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, బూత్ లెవెల్ ఏజెంట్స్ జిల్లా కమిటీ నాయకులు ,రాష్ట్ర కమిటి నాయకులు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మరియు సభ్యులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మరియు సభ్యులు ,బీసీ సెల్ అధ్యక్షులు మరియు సభ్యులు , మైనారిటీ సెల్ అధ్యక్షులు మరియు సభ్యులు ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మరియు సభ్యులు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీ×ఖ అధ్యక్షులు సోషల్ మీడియా మండల, గ్రామ కోఆర్డినేటర్ లు మరియు అందరు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు

## బిల్కల్ గ్రామపంచాయతీలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జులై 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలో 1300 మొక్కలు పంపిణీ చేయవలసి ఉన్నది అని తెలిపారు ఎంపీడీవో మేడంచేతుల మీదుగా ఇంటికి ఆరు మొక్కలు చొప్పున పంపిణీ చేయడం జరిగినది మండల మొత్తం 52,000 మొక్కలు పంపిణీ చేయవలసి ఉన్నది ఈ కార్యక్రమంలోఎంపీ డి ఓ , శాంతమ్మ, అధికారులు శ్రీనివాస్,అంజిరెడ్డి, సర్పంచ్ ఆనంద్ మండల సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ , ఉప సర్పంచ్ ,టెక్నికల్ అసిస్టెంట్ ఎఫ్ఎ వార్డ్ మెంబర్లు మరియు ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్, ఉపాధి హామీ కూలీలు కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు

# రూ.1,325 కే కొత్త విద్యుత్ మీటర్ల పంపిణీ



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 23:** వేములవాడ పట్టణంలోని 13, 14, 15 వార్డులకు చెందిన బీపీఎల్ కుటుంబాలకు తక్కువ ఖర్చుతో నూతన విద్యుత్ మీటర్లను అందించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో ఒక్కో మీటర్‌ను కేవలం రూ.1,325కే మంజూరు చేయగా, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత మీటర్ల స్థానంలో నూతన మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను తగ్గించడంతో పాటు, సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడు తుందన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్ తుమ్ మధు, టీజీఎస్పీడీసీఎల్ అధికారులు వెంకటరమణ, సిద్ధార్థ, విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కాటారంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన

జయశంకర్ భూపాలపల్లి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వేమునూరి ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన చేసిన కీలక వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి

నీట్ (ఔఇఖ) పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు రాజీనామా చేయకపోవడం సిగ్గుచేటని, దీనిపై బీజేపీ నాయకులు మౌనం వహించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ లోక్సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, వారిపై దాడులు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హత్య అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం ఈ దేశం కోసం ప్రాణాలర్పించిందని, అలాంటి కుటుంబానికి చెందిన నాయకులపై విచక్షణ కోల్పోయి లాఠీచార్జీ చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు.బీజేపీ నేతల తీరుపై ధ్వజమెత్తుతూ దేశంలో యువత తమ హక్కుల కోసం పోరాడుతుంటే వారిని "దేశద్రోహులు"గా చిత్రీకరిస్తూ, మతం పేరుతో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ నాయకులు విద్యార్థుల సమస్యలపై నోరు మెదపకుండా మౌనం వహించడం సిగ్గుచేటన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో త్రాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై-23, ప్రజాబలం ప్రతినిధి:** సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో త్రాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ త్రాగునీటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో త్రాగు నీటి సరఫరా మరింత సజావుగా జరిగేందుకు అవసరమైన అదనపు పనులు ఏవైనా ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు.

జిల్లాలోని అన్ని బోర్‌వెల్, చేతి పంపుల వద్ద వర్షపు నీటి సంరక్షణకు ఉపయోగపడే రీఛార్జ్ గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేసి, సెప్టెంబర్ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఈ చర్యలు ఎంతో ఉపయోగపడతాయని, పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్‌కు సంబంధించిన పెండింగ్ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేసి పూర్తి స్థాయిలో త్రాగునీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈ. ఈ.పూర్ణచందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఎస్ఈ గంగాధర శ్రీనివాస్, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 24 న సింగరేణి కార్మికుల కవాత్ ను జయప్రదం చేయండి : ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-23, ప్రజాబలం ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో జూలై 24 న సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం దగ్గర లో ఉన్న ప్లే గ్రౌండ్ లో (గోదావరి కళా వేదిక) సెక్టార్ వన్ కమ్యూనిటీ హాలు లో యూనియన్ ఆర్గనైజేషన్ బలోపేతం చేయడానికి సింగరేణి కార్మికుల కవాత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మరియు కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి లు పాల్గొని కవాత్ అనంతరం ప్రస్తుతం సింగరేణి లో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడుతారన్నారు. కార్మికవర్గం, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు మరియు ముఖ్య కార్యకర్తలు కవాత్ లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం

**జవహర్‌నగర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్**

**విధులకు గైర్హాజరైన వైద్యాధికారికి వివరణ ఇవ్వాలని ఆదేశం**

**ఈ-ఔషధి స్టాకులు, టీబీ మొబైల్ ఎక్స్‌రే యూనిట్ పరిశీలన**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 23:ప్రభుత్వ వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వైద్యాధికారి డా. విజయ్ చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోవడంతో పాటు ప్రజలకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.



అనంతరం క్షయవ్యాధి (టీబీ) మొబైల్ ఎక్స్‌రే యూనిట్ పనితీరును పరిశీలించి, ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాన్ని సమీక్షించారు. ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసి ఈ-ఔషధి పోర్టల్‌లో నమోదైన ఔషధ నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించడంతో పాటు, మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి ధృవీకరించారు. గడువు ముగియబోతున్న మందుల కోసం ప్రత్యేకంగా నియర్ ఎక్స్‌పైరీ డ్రగ్ కార్నర్‌ను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని ఫార్మసీ అధికారిని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగిని గౌరవంగా, ఆప్యాయంగా ఆదరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని డా. ఆనంద్ పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలని సూచించారు. విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్దేశిత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జహీరాబాద్‌కు రైల్వే రేక్ పాయింట్ , బుల్లెట్ ట్రైన్ సదుపాయాలపై కేంద్రం దృష్టి సారించాలి

**కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు**

జహీరాబాద్, జూలై 23 ప్రజాబలం ప్రతినిధి: పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ నియోజకవర్గానికి అత్యాధునిక రవాణా సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి పలు అభివృద్ధి ప్రతిపాదనలను వినతిపత్రం రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే రేక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, ధాన్యం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్ ఉత్పత్తుల రవాణా వ్యయం తగ్గడంతో పాటు పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్--ముంబై హైస్పీడ్ రైలు కారిడార్‌లో జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ స్టాప్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ , ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు అమలవుతున్నందున ప్రపంచ స్థాయి రవాణా మౌలిక వసతులు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేలాది మంది రైతులు పారిశ్రామికాభివృద్ధి కోసం భూములు ఇచ్చిన నేపథ్యంలో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుల్లెట్ ట్రైన్ స్టాప్ ఏర్పాటుతో తెలంగాణ--కర్ణాటక సరిహద్దు ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు. వినతిపత్రంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# పరిశోధనలతోనే సుస్థిర ఇంధన భవిష్యత్

**హోలీ మేరీలో సీఎస్ఐఆర్ జాతీయ సదస్సు ఘనంగా నిర్వహణ**

**సాంకేతిక ఆవిష్కరణలే అభివృద్ధికి బాటలు వేస్తాయి: డా. ఆరిమండ సిద్ధార్థ రెడ్డి**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం,జూలై 23:సుస్థిర ఇంధన వ్యవస్థల అభివృద్ధికి శాస్త్రీయ పరిశోధనలు, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలే కీలకమని హోలీ మేరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్) చైర్మన్ డా. ఆరిమండ సిద్ధార్థ రెడ్డి అన్నారు. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెరిగితేనే భవిష్యత్ ఇంధన సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు లభిస్తాయని పేర్కొన్నారు.



హోలీ మేరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ఆర్థిక సహకారంతో 'ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ యుటిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫర్ సస్టైనబుల్ స్మార్ట్ ఎనర్జీ సిస్టమ్స్' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. చంద్రశేఖర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. పి. నవీన్ కుమార్ ప్రారంభించారు.



స్మార్ట్ ఎనర్జీపై నిపుణుల విశ్లేషణ:

మధ్యాహ్న సాంకేతిక సమావేశంలో డా. ఎ. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ,... పరిశోధనలను సమాజ అవసరాలకు అనుసంధానం చేయడం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు.

సీఎస్ఐఆర్--నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ జి. వంశీ కృష్ణ మాట్లాడుతూ.. స్మార్ట్ ఎనర్జీ వ్యవస్థలు, యుటిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్, శక్తి సామర్థ్య పెంపు, పునరుత్పాదక ఇంధన రంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక సాంకేతిక పరిణామాలను వివరించారు. శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలతో దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.

సదస్సుకు డా. ఎం. శరవణన్, డా. డి. ప్రసాద్, మిస్టర్ ఎ. జితేంద్ర సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ముగింపు సాంకేతిక సమావేశంలో ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డా. ఎం. శైలజ కుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్‌కు కాంగ్రెస్ నాయకుల నిరసన



వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 23: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండిస్తూ వేములవాడ తెలంగాణ చౌక్‌లో రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సార్ అంశంపై శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. అలాగే నీట్ నీట్ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రంగు వెంకటేశం, మాజీ రూరల్ మండల అధ్యక్షుడు, వకుళాభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మర్పల్లి లో నేడే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోధర్నావిజయవంతం చేద్దాం

**సర్పంచుల సంఘం అధ్యక్షులు రఫీ యో ద్దీన్**



వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 23(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు గ్రామ కమిటీ అధ్యక్షులకు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సేవాదళ్ అధ్యక్షులు ఎస్సీ ఎస్టీ బీసీ కమిటీ అధ్యక్షులకు కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ధర్నా చేసిన మన ప్రియతమ నాయకులు భావి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ గారిని అరెస్ట్ చేసినందుకు నిరసనగా నేడే అనగా శుక్రవారం నాడు మర్పల్లి మండల కేంద్రంలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారిని రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేయడానికి సహకరించగలరనిఎండిరఫీయోద్దీన్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మర్పల్లి మండల కాంగ్రెస్ కుటుంబ సభ్యులను ఆహ్వానించడం జరిగిందని తెలిపారు

# ఆసుపత్రి సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టికు వినతిపత్రం



సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 23: సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. సురేష్ నారాయణ్ గురువారం కిష్టారం గ్రామంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యుల కొరత, నర్సింగ్ సిబ్బంది అవసరం, పారిశుద్ధ్య కార్మికుల నియామకం, అత్యవసర వైద్య పరికరాల కొనుగోలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.సత్తుపల్లి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన వైద్య, సాంకేతిక సిబ్బంది నియామకం, మౌలిక వసతుల బలోపేతం, ఆధునిక వైద్య పరికరాల సమీకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వ్యక్తం చేశారు.

# కుల్సుంపుర సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిసిన గ్రేటర్ హైదరాబాద్ ఆరెకటిగా నాయకులు



జియాగూడ: ఈనెల 29వ తేదీన శ్రీశ్రీ ధర్మవ్యాధుని జన్మదిన సందర్భంగా జియాగూడ లోని మేకల మండిలో పూజా కార్యక్రమం అన్నదానం గురువు ర్యాలీ అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులువి నర్సింగ్ రావు ఏ గంగారాం యూత్ అధ్యక్షులు జి బాలాజీ కే జానకిరామ్ పి రాకేష్ విశాల్ తదితరులు పాల్గొన్నారు

# అక్రమాలను అరెస్టులతో దాచలేరు...

### విద్యార్థుల వైపు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది

### అశ్వారావుపేట శాసనసభ్యులు జారేఆదినారాయణ

చంద్రుగొండ జులై 23 ప్రజబలం ప్రతినిధి :- దమ్మపేట మండల కేంద్రం లో ప్రశ్నాపత్రాల లీకేజీలపై న్యాయమైన శాంతియుత ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన అమానుష వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో (చీజుజు సహా) వరుసగా చోటుచేసుకుంటున్న ప్రశ్నాపత్రాల లీకేజీలతో కోట్లాది మంది



నిరుద్యోగ యువత భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, వారి గొంతును అణచివేసే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర విరుద్ధమని ఆయన మండిపడ్డారు. చీజుజు అక్రమాలను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ మరియు ఇతర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ దమ్మపేట్"ా= విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. నిజాలను అరెస్టులతో దాచలేరని, విద్యార్థుల భవిష్యత్తు కోసం మరియు ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాక రమేష్ , స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, టౌన్ అధ్యక్షులు చిట్టిబాబు , జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు , జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సత్య ప్రసాద్ ,జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి పోదిలి జ్యోతి , మహిళ బి బ్లాక్ అధ్యక్షులు సున్నం లక్ష్మి, సీనియర్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్ , రావు గంగాధర్ ,కేవీ సత్యనారాయణ , వాసం శ్రీను,సాయిల నరసింహారావు,రమేష్ నాయుడు,గోపి ,సర్పంచ్ లు భూషణం, శ్రీనివాసరావు , వెంకటేశ్వరరావు,జానకిరాం,గురుమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షులు,సోషల్ మీడియా కన్వీనర్లు, వార్డు సభ్యులు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు యువకులు పాల్గొన్నారు..

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

## పుల్కల్ మండల కేంద్రంలో విద్యాసంస్థలు బాయ్ కాట్

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 23 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా : పుల్కల్, మండల పరిధి లోని బస్వాపూర్, చౌరస్తాపై ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ధర్నా చేసిన కాంగ్రెస్ నాయకులుపుల్కల్: మండల కేంద్రం పుల్కల్ లో ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి రాహుల్ గాంధీ, అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు విద్యాసంస్థలు బంద్ చేయించి,బస్వాపూర్, చౌరస్తాపై విద్యార్థులతో కలిసి ధర్నానిర్వహించారు ఎన్ ఎస్ యు ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నిరంజన్, మాట్లాడుతూ, నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు,అక్రమంగా విద్యార్థులపై లాఠీచార్జి చేసి విద్యార్థులకు సపోర్టుగా సానుభూతి తెలుపడానికి వచ్చిన





ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అక్రమ అరెస్టును నిరసిస్తూ ధర్నా చేస్తున్నట్టు నిరంజన్ తెలిపారు,విద్యార్థుల భవిష్యత్తును ఖరాబు చేయడమే కాక వారిని మానసికంగా ఇబ్బంది పెట్టి న్యాయంగా ధర్నా చేస్తున్న వారిపై లాఠీచార్జి చేసినందుకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఏట్టి శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మన్నె విటల్, యేసు, నర్సింలు, వీరేశం, ఎన్ ఎస్ యు ఐ నాయకులు ప్రేమ్ కుమార్, ప్రవీణ్, వినయ్, మధు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

కరీంనగర్ జూలై 23 నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కరీంనగర్‌లోని 35, 36, 55 డివిజన్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మారుతి నగర్, కాపువాడ ప్రధాన చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని దొంతి గోపి, ఎం.డి. ఇర్షాద్ అలీ, మాదాసు శ్రీనివాస్ తెలిపారు.

# మనస్సే సాక్ష్యంగా మారినప్పుడు: న్యూరో టెక్నాలజీ, బ్రెయిన్ డేటా మరియు క్రిమినల్ బాధ్యత భవిష్యత్తు అంశంపై ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో అతిథి ఉపన్యాసం




హైదరాబాద్, జూలై 23, 2026: (ప్రజాబలం ప్రతినిధి) ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ (IFHE), హైదరాబాద్‌లో "మనస్సే సాక్ష్యంగా మారినప్పుడు: న్యూరో టెక్నాలజీ, బ్రెయిన్ డేటా మరియు క్రిమినల్ బాధ్యత భవిష్యత్తు" అనే అంశంపై విశిష్ట అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ ఉపన్యాసాన్ని ప్రొఫెసర్ డా. కాసిమ్ బలరాబే అందించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డిబేట్ క్లబ్ వాక్స్–పాపులీ (Vox-Populi) ఆధ్వర్యంలో, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. సదానంద్ కర్వాలే పర్యవేక్షణలో నిర్వహించారు.

కార్యక్రమం ప్రారంభంలో ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ డా. నారాయణరావు బట్టు స్వాగత ప్రసంగం చేస్తూ, న్యూరో టెక్నాలజీ నేర న్యాయ వ్యవస్థలో పోషిస్తున్న పెరుగుతున్న పాత్రను విద్యార్థులు అవగాహన చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ప్రొఫెసర్ డా. కాసిమ్ బలరాబేకు మొక్కను అందజేసి ఘనంగా సత్కరించారు.

విద్యార్థి యాంకర్లు శిఖర్, గర్విత, ఖుషి అతిథి వక్తను పరిచయం చేయగా, అనంతరం ప్రొఫెసర్ డా. కాసిమ్ బలరాబే తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, న్యూరో టెక్నాలజీ, బ్రెయిన్ డేటా మరియు క్రిమినల్ బాధ్యత మధ్య ఏర్పడుతున్న సంబంధాన్ని ఆయన వివరించారు. భవిష్యత్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు న్యూరో టెక్నాలజీకి సంబంధించిన సాంకేతిక, న్యాయపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

తన ఉపన్యాసంలో ఆయన నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అవి న్యూరో టెక్నాలజీ పరిధి మరియు పరిమితులు, సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా న్యాయ సిద్ధాంతాల అనుసరణ, న్యూరో నిఘా (Neuro-Surveillance), బ్రెయిన్ డేటా సేకరణ నేపథ్యంలో రాజ్యాంగ హక్కుల రక్షణ, అలాగే న్యూరో టెక్నాలజీ వినియోగాన్ని నియంత్రించే పరిపాలనా, చట్టపరమైన వ్యవస్థలు. అనేక వాస్తవ సంఘటనలు, ఉదాహరణల ద్వారా ఆయన ఈ క్లిష్టమైన అంశాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, గోప్యత (Privacy), నేర బాధ్యత, సాక్ష్యాధారాలు మరియు బ్రెయిన్ డేటా వినియోగానికి సంబంధించిన నైతిక, చట్టపరమైన అంశాలపై ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కార్యక్రమం ముగింపులో డా. సదానంద్ కర్వాలే, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు వాక్స్–పాపులీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, వక్తకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డా. సదానంద్ కర్వాలే మరియు ప్రొఫెసర్ డా. నారాయణరావు బట్టు కలిసి ప్రొఫెసర్ డా. కాసిమ్ బలరాబేకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

# సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి: ధనలక్ష్మి




జహీరాబాద్, జూలై 23 ప్రజాబలం ప్రతినిధి: ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ వార్‌రూమ్ కో–ఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీఎల్ఏల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన వారితో దరఖాస్తులు పూర్తి చేయించాలని కోరారు. సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి , జహీరాబాద్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్ హాజరై ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన కల్పించారు



కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, సామేల్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్‌తో పాటు మండల, పట్టణ నాయకులు, సర్పంచులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మే నెల వేతనాలు వెంటనే చెల్లించాలి

## కలెక్టరేట్‌లో సీఐటీయూ వినతి



జహీరాబాద్, జులై 23 ప్రజా బలం ప్రతినిధి: జహీరాబాద్ మున్సిపల్ కార్మికులకు మే నెల వేతనాలు ఇప్పటికీ చెల్లించకపోవడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ, రోజువారీ కూలిపై ఆధారపడే మున్సిపల్ కార్మికుల వేతనాలను పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ట్రెజరీలో నిలిచిపోయిన మే నెల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్, మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీ, మాణిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దగ్గుల రఘుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన భట్టి విక్రమార్క



**ఖమ్మం/తల్లాడ జులై 23 ప్రజాబలం:**తల్లాడ పట్టణ వాస్తవ్యులు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం రఘుపతి రెడ్డి స్వగృహం కు విచ్చేసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసినారు.



అనంతరం దగ్గుల రఘుపతి రెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డిని మరియు భార్య సరస్వతిని పరామర్శించి రఘుపతి రెడ్డి మరణానికి గల కారణాలు తెలుసుకొని వారి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలవారు పాల్గొన్నారు.

# ముమ్వా విజయబాబును కలిసిన వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 23 ప్రజాబలం:**రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబును టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. గురువారం హైదరాబాదులోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వైస్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటేశ్వర్లు ఆయనకు పూలబుకి అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకం అయిన సందర్భంగా ఇరిగేషన్ చైర్మన్ విజయబాబుని మర్యాదపూర్వకంగా కలిసి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినట్లు వెల్లడించారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు...

## నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్...

**మెదక్ ప్రజాబలం ప్రతినిధి:** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్ష నాయకుడు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసిస్తూ నిజాంపేట మండల కేంద్రంలో మండల



అధ్యక్షుడు వెంకటేష్ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ మోడీ రాజీనామా చేయాలంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి పరీక్షలు లీక్ అయినందున విద్యార్థులు శాంతియుతంగా ధర్నా చేపడుతుంటే పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేయడం దారుణమని వెంటనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ త్యాగాల కుటుంబమని ఇందిరాగాంధీ నుండి మొదలుకొని రాజీవ్ గాంధీ వరకు దేశానికి చేసిన సేవలు మర్చిపోలేవు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థి నాయకుల సంఘాలకు క్షమాపణ చెప్పాలని నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం ధర్నా వద్దకు ఎస్సై రాజేష్ చేరుకుని నాయకులకు సర్ది చెప్పి ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొమ్మట బాబు, పి ఎస్ సి ఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు బొమ్మన మల్లేశం, రామచందర్ నాయక్, జెల్ల లక్ష్మణ్ గౌడ్, లక్ష్మా గౌడ్,ఉప సర్పంచ్ లు ఆకుల మహేందర్, అంజిరెడ్డి,కుమార్, దేవరాజ్, నాయకులుగరుగుల శ్రీనివాస్,సుధాకర్, రాజేష్, కనకరాజు,శ్రీకాంత్,కంతల కొండల్, పరశురాములు, భూపతి రెడ్డి, టంకరి లక్ష్మణ్,రాజు, తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుంట లో బురద మయంగా మారిన రహదారి...

**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి:** నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట ప్రాథమిక పాఠశాల వెనుక రహదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

# మూడు రోజుల ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి విద్య అధికారి బి అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 23(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల విద్యాధికారి బి అశోక్ మర్పల్లి మండలంలో ఇంటిగ్రేటెడ్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ మూడు రోజుల ంజూవశ్రీశ్రీ – 2 శిక్షణ కార్యక్రమాన్నీ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యారంగంలో ఎప్పటికప్పుడు నూతన పోకడలను వృత్యాంతర శిక్షణ కాలంలో తెలుసుకొని క్షేత్రస్థాయిలో పాఠశాల లోని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామేశ్వర్ పాల్గొన్నారు మరియు ఆర్ పి లు కేశవులు సార్, రమేష్ సార్, రవి , పవన్ కుమార్ , మరియు సి ఆర్ పి మల్లేశం, ఉపాధ్యాయులు పాలుగోన్నారు

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన -- ప్రత్యామ్నాయ పంటలు, బోరు బావుల రీఛార్జ్‌పై సూచనలు



**కోనరావుపేట ప్రజాబలం దినపత్రిక ప్రజాబలం , జూలై 23:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మర్రిమడ్ల గ్రామ రైతులకు ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి పొదుపు చర్యలు, బోరు బావుల రీఛార్జ్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి అనుముల సహజ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే బోరు బావుల రీఛార్జ్ పిట్లు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భద్రపరచి భూగర్భ జలాల స్థాయిని పెంచవచ్చని వివరించారు. రైతులు వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని, వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సూచనలను పాటించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, అధికారులు సూచించిన పద్ధతులను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దిలీప్ రెడ్డి, సర్పంచ్ కోలా స్వాతి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 23**జమ్మికుంట పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు,ఈసందర్భంగా కొలకాని రాజు, శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్ మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులు కాక్రోచ్ పార్టీ పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ దేశ అత్యున్నతమైన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం, దేశ ప్రధాని నివాసం ముందు ధర్నా కార్యక్రమల పేరుతో విద్యార్థుల ముసుగులో సంఘవిద్రోహులను ప్రోత్సహిస్తూ విదేశాల నుండి వచ్చినటువంటి సొమ్ముతో కాక్రోచ్ పార్టీ నాయకులు దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టి, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ లాంటి పరిస్థితులు దేశంలో తీసుకువస్తామని, పోలీసుల పై, ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేస్తూ, వాహనాలు ధ్వంసం చేస్తూ దేశ రాజధాని లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తుంటే రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ వారికి మద్దతు తెలపడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు, నీట్ ఎగ్జామ్ పై చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి, మరియు పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి స్వయంగా ప్రకటించినప్పటికీ పార్లమెంటు సమావేశాలకు రాహుల్ గాంధీ, ఇతర ఎంపీలు హాజరుకాకుండా విద్యార్థుల ముసుగులో సంఘవిద్రోహ శక్తులను రాహుల్ గాంధీ ప్రోత్సాహించడం మానుకోవాలని జమ్మికుంట పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు,ఈకార్యక్రమంలో నాయకులు రాజేష్ ఠాకుర్, కైలాసకొటి గణేష్, అడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, కేస స్వరూప, ఇటుకాల స్వరూప, గంగాభవాని, రాకేష్ ఠాకూర్, సతీష్, సురేష్, నగేష్, బల్సుకురి రాజేష్, శ్రీవర్తి ప్రవీణ్, ఆకుల పోచయ్య, నసీరుద్దీన్, బొనగిరి ప్రణీత్, పనికారి రమేష్, అనిల్, ఉడుగుల మహేందర్, కొండపర్తి ప్రవీణ్, నెల్లి రాజు, సమ్మిరెడ్డి, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, ఎదులాపురం శ్రీనివాస్, కొలకాని అరవింద్ తదితరులు పాల్గొన్నారు

# రోమాంచకం" మూవీ ఫస్ట్ సింగిల్ 'రాధా రమణ' రిలీజ్



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన "రోమాంచకం" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ రోజు "రోమాంచకం" సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'రాధా రమణ' రిలీజ్ చేశారు. ఈ పాటకు ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ అందమైన సాహిత్యాన్ని అందించగా...మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ మెమొరబుల్ ట్యూన్ తో కంపోజ్ చేసి శ్రావ్యంగా పాడారు. హీరో హీరోయిన్స్ మధ్య బ్యూటిఫుల్ పొయెటిక్ రొమాంటిక్ మేకింగ్ తో ఈ పాటను చిత్రీకరించారు. 'రాధా రమణ' పాట ఎలా ఉందో చూస్తే – 'రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో..ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..ఓ కన్నా నీ అందమే..అలలై అలలై ముంచే, కన్నుల్లో అందుకే కలలే కథలే పెంచే, ఆవేశమే తెరచాటుగా లాగగా, బిడియాల ఆదేశమే పొరపాటనీ ఆపగా, ఈ ఊగిసలో, ఊయలలో, ఉందనా లేదనా..' అని సాగుతూ ఈ పాట ఆకట్టుకుంటోంది.

"రోమాంచకం" సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు తెరపైకి రాబోతోంది. ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రేక్షకుల్ని థియేటర్స్ లో ఎంగేజ్ చేయబోతోందీ మూవీ.

నటీనటులు – సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్, ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి, మణి, సోహన్, తదితరులు

# వారణాసి' సినిమా టైటిల్‌ను స్వచ్ఛందంగా ఇచ్చేశాను – దర్శకుడు సుబ్బారెడ్డి



దర్శకుడు సుబ్బారెడ్డి తన వద్ద రిజిస్టర్ అయిన 'వారణాసి' సినిమా టైటిల్‌ను దర్శక దిగ్గజం ఎస్.ఎస్.రాజమౌళి మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్, దర్శకుడు సుబ్బారెడ్డి కలిసి ఇంటర్వ్యూలో చర్చించారు.

దర్శకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, 2023లో 'వారణాసి' టైటిల్‌ను తన బ్యానర్‌పై రిజిస్టర్ చేసుకుని ఆ కథపై పని ప్రారంభించానని తెలిపారు. అయితే అదే టైటిల్ రాజమౌళి సినిమా కోసం అవసరమైందని తెలిసిన తర్వాత, తెలుగు సినిమా గౌరవం దృష్ట్యా ఎలాంటి సందేహం లేకుండా ఇవ్వాలని నిర్ణయించుకున్నానన్నారు. తన అభిమాన హీరో మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి, నిర్మాత కేఎల్ నారాయణ కలిసి చేస్తున్న ఈ భారీ చిత్రానికి టైటిల్ ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారంగా చూడలేదని, ఒక్క రూపాయి కూడా తీసుకోవాలనే ఆలోచన తనకు రాలేదని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

"టైటిల్ అనేది నాకు ఒక ఎమోషన్. దాన్ని అమ్మడానికి కాదు, మంచి సినిమా కోసం ఇవ్వడానికి సిద్ధపడ్డాను" అని పేర్కొన్నారు.

దర్శకుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ, మొదట సుబ్బారెడ్డి ఆ టైటిల్‌పై ఎంతో భావోద్వేగంతో ఉన్నారని, అందుకే వెంటనే మాట్లాడలేదన్నారు. తరువాత రాజమౌళి, కేఎల్ నారాయణ వంటి ప్రముఖుల చిత్రం కోసం టైటిల్ ఇస్తే ఇండస్ట్రీకి మంచి సందేశం వెళ్తుందని వివరించగా, సుబ్బారెడ్డి వెంటనే అంగీకరించారని తెలిపారు.

టైటిళ్లను డబ్బు కోసం కాకుండా, పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరస్పరం సహకరించుకోవాలని ఈ నిర్ణయం ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని వీరశంకర్ అభిప్రాయపడ్డారు. సుబ్బారెడ్డి చేసిన ఈ నిర్ణయం భవిష్యత్‌లో ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు.

ఈ సందర్భంగా రాజమౌళి, నిర్మాత కేఎల్ నారాయణ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, గేయరచయిత చంద్రబోస్‌లకు తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, 'వారణాసి' చిత్రం ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## ఆటో డ్రైవర్ల సమస్యల పై ఐక్య పోరాటం

మంచిర్యాల పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఏ , 246 మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్, జేఏసీ ఆటో యూనియన్ తదితర ఆటో యూనియన్ల జిల్లా నాయకులు పాల్గొని, మంచిర్యాల జిల్లా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

నాయకులు మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం అమలు అనంతరం ఆటోలకు గిరాకీ తీవ్రంగా తగ్గిపోయి వేలాది మంది ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాపిడో కార్యకలాపాల కారణంగా కూడా ఆటో డ్రైవర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అన్ని ఆటో యూనియన్లు రాపిడోను అరికట్టేందుకు ఐక్యంగా పోరాటం చేస్తామని, అవసరమైతే మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించి రాపిడో కార్యకలాపాలను అడ్డుకుంటామని తీర్మానం చేశారు.

## కస్తూర్బా పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ రక్షణ సేన మండల అధ్యక్షుడు అంబల హరీష్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 23**జమ్మికుంట పట్టణంలోని కస్తూరిబా బాలికల హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన మండల అధ్యక్షుడు అంబల హరీష్ విజ్ఞప్తి చేశారు. గత వారం రోజుల నుండి కస్తూర్బా పాఠశాలలో ఉన్న విద్యార్థినిలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని.అన్నంలో పురుగులు రావడం నీళ్లల సాంబార్ చేయడం విద్యార్థులకు నీటి సౌకర్యం లేకపోవడం వల్ల స్నానం చేయడానికి బహిర్భూమికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రిన్సిపాల్ చూసి చూడనట్టు వ్యవహరించడం వల్ల ఇక్కడ ఉన్న సమస్యలను మండల అధికారులకు గాని జిల్లా అధికారులకు గాని తెలియజేయకుండా ఎవరైనా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు చెప్పితే వారిని భయాందోళనలకు గురి చేయడం చేస్తుందని పేర్కొన్నారు కూత వేటు దూరంలో ఉన్న మండల అధికారులు కూడా కనీసం వచ్చి విద్యార్థులను పరామర్శించకపోవడం విద్యార్థుల పట్ల విద్యాధికారుల నిర్లక్ష్యం కనబడుతుందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని లేనియెడల తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం వొడితల ప్రణవ్

- రవాణా వ్యవస్థ ద్వారా గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతున్నాం.
- బొంతుపల్లి గ్రామంలో బస్ సర్వీసును ప్రారంభించిన ప్రణవ్.
- రైతులకు ఉపయోగపడే కల్వర్టు ప్రారంభం..
ముఖ్యమంత్రి,మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రణవ్,గ్రామస్థులు..
- బస్ సర్వీసును ఉపయోగించుకోండి...

**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 23** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించామని,మహిళల చుట్టే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున జమ్మికుంట నుండి గద్దపాక వరకు నడిచే బస్ సర్వీసును బొంతుపల్లి గ్రామంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రణవ్ కు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు,అనంతరం మహిళలతో కలిసి టికెట్ తీసుకొని బస్ లో ప్రయాణించారు.మహాలక్ష్మి,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడగగా అందుతున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు.అంతకుముందు ఇదే గ్రామంలో 8 లక్షల ఎస్డిఎఫ్ నిధులతో





నిర్మించిన కల్వర్టును ప్రణవ్ ప్రారంభించారు.ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాల పై చిలుకు రైతులకు ఇది ఉపయోగపడుతుందని,ఈ విషయంపై హుజురాబాద్ ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మంజూరు చేపించిన ప్రణవ్ కు గ్రామస్థులు,రైతులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళు న్నారని,ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తున్నామని,గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని దీన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.ఈ సర్వీసు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా ఇంచార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల శాఖ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 10వ వార్డులో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 23**:వేములవాడ పట్టణంలోని 10వ వార్డులో గత కొంతకాలంగా నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారంగా నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ సిరిగిరి సంగీత--శ్రీకాంత్ కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లో-వోల్టేజ్‌తో పాటు ఇతర విద్యుత్ సమస్యలను కూడా దశలవారీగా



పరిష్కరిస్తూ అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో 10వ వార్డు ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ డీఈ వెంకటరమణ, ఏఈ సిద్ధార్థ, కౌన్సిలర్ తుమ్మ మధు, లైన్ ఇన్స్పెక్టర్ నాగిరెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com